ఈనాడు అనంతపురం

మంగళవారం 29 ఆగస్టు 2017 | 16 పేజీలు

నంద్యాల గెలుపు.. ప్రగతికి పిలుపు!

ప్రజలు ప్రగతిని కోరుకుంటున్నారనీ... అందుకే తెలుగుదేశానికి బ్రహ్మరథం పట్టారని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో తెదేపా ఘన విజయంతో సోమవారం జిల్లాలో తెదేపా శ్రేణుల సంబరాలు మిన్నంటాయి.



అనంతపురంలో తెదేపా శ్రేణుల విజయోత్సవం

పేదను కొట్టు.. పెద్దకు పెట్టు!

మరో విశేషం ఏమంటే.. పెనుకొండలో ఒక ముఖ్య ప్రజాప్రతినిధికి రూ.కోట్లలో ఆస్తులు ఉన్నాయి. అయినప్పటికీ తన ఇద్దరు కోడళ్ల పేరిట ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో రెండు గృహాలను మంజూరు చేయించుకొన్నారు. వీటిపై గృహ నిర్మాణ శాఖాధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

- అడ్డదిడ్డంగా లబ్ధిదారుల ఎంపిక
- రాజకీయుల బంధువులకే పెద్దపీట
- గృహ నిర్మాణ పథకాల్లో ఇష్టారాజ్యం
- పెనుకొండ హౌసింగ్ డివిజన్‌లో తీరిది



ఇది.. పెనుకొండలోని తెలుగుతల్లి ప్రధాన కూడలిలో ఉన్న వ్యాపార సముదాయ భవనం. అంతే కాదు.. గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి సమీపంలోనే ఉంది. దీని విలువ ఏకంగా రూ.కోట్లలో ఉంటుంది. ఈ భవనం యజమానురాలి పేరిట ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఇంటిని మంజూరు చేశారు. అధికారులు, జన్మభూమి కమిటీల వారు గ్రామసభను నిర్వహించి మరీ యూనిట్ మంజూరు చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు.



మీరు చూస్తోంది.. పెనుకొండ పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల కూడలిలోని ఒక అంతస్తు భవనం. ఇది ఒక తెదేపా నాయకుడికి చెందింది. కానీ.. ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో ఆ నాయకుడి భార్యకు ఇంటిని మంజూరు చేశారు. ఇంకా వీరు గృహ నిర్మాణం చేపట్టలేదు. ధనికులకు ఇళ్లను మంజూరు చేస్తున్నారనేందుకు ఇదో నిదర్శనం. ఇటువంటివి పెనుకొండలో చాలానే ఉన్నాయి.





పెనుకొండ, న్యూస్‌టుడే: "సొంతిల్లు.. ప్రతి ఒక్కరి కల. దీనిని సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కకు మిక్కిలి పథకాలను అమలు చేస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు దాసోహం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎన్టీఆర్ పేరు మీద అమలు చేస్తున్న ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో అర్హులైన పేదలకు కాకుండా.. పెద్దలకు, ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారు. గ్రామసభలను నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాల్సిన ఎండీటీ బృందాలు రాజకీయ ఒత్తిళ్లతో ఇప్పటికే గృహాలు ఉన్న వారికి, ధనికులకు, ఏకంగా ప్రజాప్రతినిధుల బంధువులకు గృహాలను మంజూరు చేయడం గమనార్హం. ఒక్కమాటలో చెప్పాలంటే.. పేదల నోట్లో మట్టికొట్టి.. పెద్దలకు కట్టబెట్టు అనేది తమ అజెండా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వెరసి అర్హులైన పేదల సొంతింటి కల కలగానే మిగిలింది. పెనుకొండ హౌసింగ్ డివిజన్ పరిధిలో 2016-17కు మంజూరైన ఎన్టీఆర్ రూరల్ గృహ నిర్మాణ పథకంలో, పీఎంఏవైలోనూ దాగిన 'గూడు'పురాణిపై 'న్యూస్‌టుడే' నిఘా కథనం.

2016-17 ఏడాదికిగాను పెనుకొండ డివిజన్‌లోని హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో (పీఎంఏవై) 394 గృహాలు, ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ

మిగతా 7లో ▶



పెనుకొండలోని తోటగేరిలో ఓ ప్రజాప్రతినిధికి చెందిన గృహమిది. ఈ ఇంటిలో సగం వాటా అతడిదే. ఆయన తన భార్య పేరిట ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో ఇల్లు మంజూరు చేయించుకొన్నారు. అయితే ఇంకా ఇల్లు నిర్మాణం చేపట్టలేదు. కానీ.. ఒక అంతస్తు భవనం ఉన్న ప్రజాప్రతినిధి భార్యకు ఇల్లు మంజూరు చేయడంపై పలువురు విస్మయం చెందుతున్నారు. దీనిపై గృహ నిర్మాణ శాఖాధికారులు నోరు మెదపడం లేదు.

ప్రాణాలతో చెలగాటం!



"వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా అంతటా పెద్దఎత్తున మండపాలు ఏర్పాటయ్యాయి.. యువత, వివిధ కాలనీవాసులు సంబరాలు చేస్తున్నారు. అయితే వీరిలో పలువురు నిబంధనలు పాటించకుండా అనధికారికంగా విద్యుత్తును వినియోగించడం ప్రమాదాలకు కారణం అవుతోంది. అనధికార విద్యుత్తు కనెక్షన్లతో అమాయకులు బలవుతున్నారు. అయితే ఎక్కడికక్కడ అన్ని మండపాలు అధికారికంగా తాత్కాలిక అనుమతులు తీసుకున్నాయా? లేదా? అని పరిశీలించాల్సిన విద్యుత్తు శాఖ అధికారులు.. ఈవిషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారు."

- అత్యధికంగా అనధికార విద్యుత్తు కనెక్షన్లు
- వరుస ఘటనలతో ముగ్గురి విషాదాంతం
- గణేశ్ మండపాల చెంత తీవ్ర నిర్లక్ష్యం...
- పోలీసులు చెప్పినా కదలని విద్యుత్తు శాఖ

ఈనాడు - అనంతపురం: ఏటా వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తారని తెలుసు.. మూడు నుంచి 9 రోజులు కొనసాగే మండపాలకు విద్యుత్తు సదుపాయం ఉండాలనీ తెలుసు.. ఎక్కువ మంది నిర్వాహకులు అధికారికంగా విద్యుత్తు కనెక్షన్ తీసుకోరని కూడా తెలుసు.. అయినా సరే వారు కనెక్షన్ తీసుకునేలా చూడటం, వారు ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు సదుపాయం సరిగ్గా ఉందా? లేదా? అనేది పరిశీలించాల్సిన విద్యుత్తు శాఖ ఈ విషయంలో ప్రతిసారి నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా కొందరు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. ఈసారి కూడా ఇలాంటి ఘటనలే మళ్లీ చోటుచేసుకున్నాయి. వరుసగా రెండురోజుల్లో ముగ్గురు (ఒక చిన్నారి, ఇద్దరు యువకులు) చనిపోగా, మరొక చిన్నారి చేతివేళ్లు కాలిపోయాయి. రాప్తాడు, శెట్టూరు, తాడిమర్రి మండలాల పరిధిలోని మండపాల్లో విద్యుదాఘాతానికి గురై ముగ్గురు చనిపోయారు. ఈ మూడు మండపాల నిర్వాహకులు అనధికారికంగా సమీపంలోని ప్రధాన విద్యుత్తు లైన్ నుంచి కొక్కేలు వేసి విద్యుత్తు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఇది అక్రమ

మిగతా 7లో ▶



నియంత్రికలను తెరిచి పరిశీలిస్తున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పుల్లారెడ్డి, కమిటీ సభ్యులు

నియంత్రికలకు సీల్ వేయిస్తాం

- ఇకపై మూడో సంస్థతో నాణ్యత పరిశీలన
- ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల తనిఖీలు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (హెచ్‌వీడీఎస్) పథకం కింద ఏర్పాటు చేసిన నియంత్రికలకు శాఖాపరంగా భవిష్యత్తులో ప్రత్యేక సీల్ వేయించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పుల్లారెడ్డి తెలిపారు. ఈ నెల 14న 'ఈనాడు'

మిగతా 7లో ▶

చెరుకు కోసం వెళ్లి.. తిరిగిరాని లోకాలకు...

విద్యుదాఘాతంతో బాలిక మృతి


అరుణ మృతదేహం

గుత్తి, న్యూస్‌టుడే: ఆ బాలిక బడికి వెళదామనుకుంది. అంత లోనే విధి కోతి రూపంలో మృత్యు ఒడి చేర్చింది. ఈ విషాదకర సంఘటన గుత్తి మండలంలోని రజాపురంలో జరిగింది. వివరాలు గ్రామానికి చెందిన అరుణ (6) సోమవారం ఉదయాన్నే లేవడంతో అమ్మానాన్నలు ఇంట్లో ఉన్న చెరుకుగడను ఇచ్చారు. ఇంటి బయట నిలుచుని చెరుకును తింటుండగా కోతి ఒక్క దూకుడుతో వచ్చి లాక్కొని కెళ్లింది. ఇంటి పైకి కోతి వెళ్లడంతో అరుణ కూడా చెరుకు కోసం వెళ్లింది. ఈ సమయంలో పైకప్పున ఉన్న విద్యుత్తు తీగ తగిలి విద్యుదాఘాతానికి గురైంది. ఈ ప్రమాదంలో బాలిక అక్కడికక్కడే మరణించింది. పాప కనిపించకపోయేసరికి తల్లి దండ్రులు ఇంటి పైకి ఎక్కిచూశారు. అప్పటికే ఆ బాలిక తనువు చాలించింది. దీంతో తండ్రి రంగడు, తల్లి గుండెలు అవిసేలా రోదించారు. పొరపాలకు పంపాలకున్న సమయంలోనే తమ కుమార్తె విద్యుదాఘాతంతో మరణించటాన్ని జీర్ణించుకోలేకపోయారు. చెరుకు ముక్కకోసం ఇంటిపైకి వెళ్లి తనువు చాలించిన కుమార్తెను చూసి బోరున విలపించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య


మృతిచెందిన భవ్యశ్రీ

మోతుకపల్లి (హిందూపురం), న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని మోతుకపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం భవ్యశ్రీ(16) అనే విద్యార్థిని ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ జయలక్ష్మీ తెలిపారు. హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న భవ్యశ్రీ సోమవారం ఎప్పటిలాగే కళాశాలకు వెళ్లివచ్చిన తర్వాత ఇంటిలో ఉరివేసుకుంది. దీన్ని వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా.. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు. మృతికి కారణాలు తెలియరాలేదని, వారి కుటుంబీకులు భవ్యశ్రీకి మూర్ఛ వ్యాధి ఉన్నట్లు చెబుతున్నారని అన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రయాణికుడి హఠాన్మరణం


మృతిచెందిన వ్యక్తి

నల్లచెరువు(కదిరి), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ప్రయాణికుడు గుండెపోటుతో బస్సులో మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గుర్తు తెలియని ఓ ప్రయాణికుడు మదనపల్లికి వెళ్లేందుకు కదిరిలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మదనపల్లికి టికెట్ తీసుకున్నాడు. నల్లచెరువు వద్ద ఆయన మూర్ఛకు గురైనట్లు ప్రయాణికులు తెలిపారు. తోటి ప్రయాణికులు నియంత్రించే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో గుండెపోటుకు గురవటంతో మరణించాడని పేర్కొన్నారు. పోలీసులు మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో పసికందు మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనంటున్న బాధితులు


చనిపోయిన పసికందు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రసూతి విభాగంలో మరో పసికందు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితులు ఆగ్రహించారు. వైద్యులతో వాదనకు దిగారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాధితులను సముదాయించారు. ఈ ఘటన సోమవారం ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన శిల్ప సుఖ ప్రసవం కోసం ఈనెల 19న ఆస్పత్రిలో చేరింది. నాలుగు రోజుల పాటు గర్భిణుల విభాగంలో(బండల వార్డు) ఉంది. అక్కడి నుంచి ప్రసూతి విభాగానికి మార్చారు. ఆదివారం సాయంత్రం నుంచే ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని నర్సులకు చెప్పినా పెద్దగా పట్టించుకోలేదు. మరోవైపు తీవ్ర జ్వరం వచ్చింది. తీవ్ర జ్వరం నడుమే సోమవారం మధ్యాహ్నం 1.25 గంటల సమయంలో సుఖ ప్రసవం పొందింది. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. మెడకు పేగు చుట్టుకుని బిడ్డ పుట్టింది. పసికందును నవజాత శిశువైద్య కేంద్రానికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బిడ్డ మృత్యువాత పడింది. దీంతో బాధితులు ప్రసూతి విభాగం వైద్య సిబ్బందితో గొడవకు దిగారు. ప్రసవం సరిగా చేయకపోవడంతోనే ఇలా జరిగిందంటూ ఆరోపించారు. ఈ ప్రసవం ఓ ఎస్ఆర్ చేసినట్లు తెలిసింది. ఆ సమయంలో రెగ్యులర్ డాక్టర్ మరొక గర్భిణికి సిజేరియన్ చేసినట్లు సమాచారం. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ చనిపోయిందని బాధితులు ఆరోపించారు. ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ విజయమ్మ అక్కడికి చేరుకున్నారు. ఏం జరిగిందని ఆరా తీశారు. 'ఇక్కడి వైద్య సిబ్బంది మొదటి నుంచి బాగానే చూశారు. మెడకు పేగు చుట్టుకుని పుట్టడంతోనే ఊపిరి ఆడలేక చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదు. సోమవారం ఉదయం 8 గంటలకు కూడా స్కానింగ్ చేశారు. దురదృష్టవశాత్తు బిడ్డ చనిపోయిందని' డాక్టర్ విజయమ్మ సర్ది చెప్పారు. చివరికి బిడ్డను శవ పరీక్షకు అప్పగించారు.

గర్భిణుల నమోదులో నిర్లక్ష్యం వద్దు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సేవలు అందివ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయ సభా మందిరంలో ఎమ్పీహెచ్ఈఓ, సీహెచ్ఓలతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రజలకు అందించే సేవల్లో జాప్యం, నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిర్దేశిత సేవలు క్షేత్ర స్థాయికి చేరాలి. ప్రతి పథకాన్ని లబ్ధిదారులకు చేరేలా విస్తృత ప్రచారం చేయాల్సి ఉందన్నారు. 12 వారాలకు విధిగా గర్భిణుల పేర్లు నమోదు కావాలి. వారికి అందే వైద్య సేవలన్నీ తప్పక అందించాలన్నారు ప్రతి గర్భిణిని సంబంధిత వైద్యుడు నాలుగు సార్లు పరీక్షించాలి. ఏవైన లోపాలు, సమస్యలు ఉంటే తక్షణమే తగిన సేవలు అందించాలని ఆదేశించారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తాపించాలి. జీరో డోసు టీకాలను కూడా వేయించాలన్నారు. ఈ సమీక్షలో అదనపు డీఎంహెచ్ఓలు డాక్టర్ పద్మావతి, డాక్టర్ అనిల్‌కుమార్, ఉప వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

ఐసీడీఎస్ పీడీగా వెంకటేశం



అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా మహిళా బివృద్ధి, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) పీడీగా జి.వెంకటేశం నియమితులయ్యారు. సోమవారం ఆ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) హోదాలో ఉన్న ఈయన.. ప్రస్తుతం జిల్లా యువజన సేవలు-ఆన్‌సెట్ సీఈఓగా పనిచేస్తున్నారు. జిల్లాలో అనేక శాఖల్లో సేవలు అందించారు. ప్రస్తుత ఐసీడీఎస్ పీడీ పోస్టు ఖాళీగా ఉంది. మూడు మాసాల క్రితం ఇక్కడి పీడీ జుబేదాబేగం కర్నూలుకు బదిలీ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి రెగ్యులర్ పీడీ లేరు. అదనపు పీడీ ఉషా ఫణికర్ కూడా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో అనంత అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణకుమారి ఇన్‌ఛార్జిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్‌ఏసీ పీడీగా వెంకటేశంను నియమించారు. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీ


దస్త్రాలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో సోమవారం ఉరవకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ రామకృష్ణయ్య తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. పట్టణంలో ఏర్పాటైన లేఅవుట్లలో ఎన్నింటికి అనుమతులు ఉన్నాయి? ఎన్నింటికి లేవు? అవి ఎప్పుడు ఏర్పాటయ్యాయి? వాటికి ఎన్‌వోసీలు జారీ చేసింది ఎవరు? వాటిలో భాగస్వాములైన అధికారులు, అనధికారులు ఎవరు? అన్న వివరాలను ఈ తనిఖీల ద్వారా బహిర్గతం చేస్తామన్నారు. అక్రమంగా వెలిసిన లేఅవుట్లకు బాధ్యులైన అందరిపై చర్యలు కోరుతూ ఉన్నత అధికారులకు ప్రతిపాదిస్తామన్నారు. తమకు అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. అక్రమంగా వెలిసిన లేఅవుట్లు, ఎన్‌వోసీల జారీపై

వాహన చోదకులకు జరిమానా

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 33 మంది నిందితులకు రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ రెండవ తరగతి ప్రత్యేక న్యాయస్థానం సోమవారం తీర్పును వెలువరించింది. ట్రాఫిక్ డీఎస్పీ నరసింగప్ప తెలిపిన వివరాల మేరకు రోడ్డు భద్రతలో భాగంగా ఎస్సై నాగేంద్ర, ఏఎస్సై అజయ్‌కుమార్ నగరంలోని పలు కూడళ్లలో ఆదివారం రాత్రి శ్వాస పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపినట్లు రుజువు కావడంతో 33 మందిపై కేసులు నమోదు చేసి రెండవ తరగతి ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కృష్ణమూర్తి తీర్పును వెలువరించారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

కల్లూరు (లేపాక్షి), న్యూస్‌టుడే: లేపాక్షి మండలంలోని కల్లూరులో సోమవారం నిర్వహించిన వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్(19) నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని యువకులతో కలిసి చిందులు వేస్తూ అకస్మాత్తుగా కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమవటంతో స్థానికులు వెంటనే ఆటోలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా.. మార్గం మధ్యలోనే మృతి చెందాడు.

నీటి కుంటలో పడి దుర్మరణం


హంద్రీనీవా నీటి గుంతలో తేలియాడుతున్న మృతదేహం

తనకల్లు,న్యూస్‌టుడే: మండల పరిధిలోని కురుమాలపల్లికి చెందిన గుడే మల్లయ్య (61) సమీపంలోని హంద్రీనీవా కాలువలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీనివాసులు వివరాల మేరకు శనివారం సాయంత్రం సమీపంలోని మార్కొరివండ్లపల్లి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. కురుమాళ్లపల్లికి మార్కొరివాండ్లపల్లికి మధ్యలో హంద్రీనీవా కాలువ కింద వర్షపు నీరు వెళ్లడానికి దాదాపు 30 అడుగుల లోతున సప్లై ఛానల్‌ను నిర్మించారు. అందులో వర్షపు నీరు నిండాయి. దానికి పైన ఎటువంటి అడ్డుగోడ లేకపోవడంతో ఇంటికి వస్తూ రాత్రి సమయంలో అందులోపడి మృతి చెందాడు.. సోమవారం ఉదయం అటు వెళ్తున్న గ్రామస్థులు గుర్తించి కుటుంబసభ్యులకు చెప్పడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతని భార్య, కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ -	కేజీ
కోడిమాంసం -	రూ. 160
కోడిమాంసం(స్కిన్‌లెస్) -	రూ.170
బోన్‌లెస్ -	రూ.300
హోల్‌సేల్ లైవ్ -	రూ 80
నాటుకోడి (లైవ్) -	రూ.330
నాటుకోడి మాంసం -	రూ.350

మటన్ ధరలు

పొట్టేలు మాంసం- కేజీ రూ.440
గొర్రె మాంసం- కేజీ రూ.380

చేపలు ధరలు

సాధారణ చేపలు రూ.120
కట్ల రూహు చేపలు రూ.130
బొంగ్రా చేపలు- రూ.200
బోన్‌లెస్ చేపలు- రూ.220
చిన్న టైగర్ రొయ్యలు- రూ.240
పీతలు - రూ.170

కోడిగుడ్లు

డజను గుడ్లు(12) - రూ.52
హోల్‌సేల్(100) - రూ.400

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

హిందూపురం, (న్యూస్‌టుడే):

రకము:	బైవోల్టిన్	క్రాస్‌బీడింగ్ (సీబీ)
కనిష్ఠధర:	330.00	305.00
గరిష్ఠ ధర:	535.00	400.00
సగటు ధర:	483.00	343.00

తెరపై ఈనాడు


అనంతపురం

- గంగ... అర్జున్‌రెడ్డి
- గౌరి.... ఫిదా
- గాయత్రి.. వివిపి2
- గౌతమి... లై
- త్రివేణి... వివేకం
- తరంగిణి... ఆనందో బ్రహ్మ
- తేజస్విని... ఏ జెంటిల్‌మ్యాన్
- శాంతి... నేనే రాజు నేనే మంత్రి
- సుధ.. అర్జున్‌రెడ్డి
- స్వప్న... గజ్జల గుర్రం
- ఎస్వీ సినిమాక్స్.. జయ జానకి నాయక
- నీలిమ... అమీ తుమీ

క్రీడా పరుగు.. అనంత వెలుగు

- జిల్లాలో ఐదు క్రీడావికాస కేంద్రాల నిర్మాణానికి అడుగు
- నూతన విధానం అమలుకు శ్రీకారం
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్.... ఈ పేరు వింటేనే యావత్ హాకీ ప్రపంచం పులకిస్తుంది. ఒలింపిక్స్ హాకీలో మనదేశాన్ని తిరుగులేని శక్తిగా మార్చిన గొప్ప యోధుడు. విశ్వక్రీడల్లో అనేక పర్యాయాలు స్వర్ణాలు సాధించడానికి పథనిర్దేశం చేసిన మేరునగ ధీరుడు ధ్యాన్‌చంద్. ప్రపంచ పుట్‌బాల్ కీర్తికిరీటంలో పీలే, క్రికెట్‌లో బ్రాడ్‌మన్ స్థానం ఎలాంటిదో ప్రపంచ హాకీలో ధ్యాన్‌చంద్ స్థానం కూడా అలాంటిదే. ఝాన్సీ నగరంలో జన్మించిన ఆయన హాకీ మాంత్రికుడిగా ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు సాధించాడు. హాకీ క్రీడకు ఒలింపిక్స్‌లో ప్రవేశం కల్పించిన తర్వాత వరుసగా మూడు పర్యాయాలు భారత్ ఛాంపియన్‌గా నిలవడానికి సూత్రధారి ఆయనే. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీలో జరిగిన ఒలింపిక్స్‌లో ధ్యాన్‌చంద్ ఆటతీరుకు హిట్లర్ సైతం సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. అలాంటి గొప్ప హాకీ ఆటగాడి పుట్టిన రోజునే జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహించుకుంటారు. ఏటా ఆగస్టు 29న ఆ మహనీయుడి జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. ధ్యాన్‌చంద్ లాంటి క్రీడాకారులను దేశానికి అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. మన తెలుగు తేజం పీవీ సింధు గత ఒలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో రజతం, తాజాగా జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్‌లో కూడా రజతం దేశానికి కానుకగా అందించడం క్రీడాకారుల్లో స్ఫూర్తిని రగిలించాయి. క్రీడాసంస్కృతిని పరిమళింపజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా క్రీడావికాస కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.



గుత్తి కోటలో మెరిసిన క్రీడారత్నాలు

ఫుట్‌బాల్ అంటే జిల్లాలో మొదట గుర్తొచ్చేది గుత్తి పట్టణమే. ఇక్కడి నుంచి ఎంతోమంది జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించారు. ఫుట్‌బాల్ సాధన కోసం కొంత సౌకర్యాలు ఉన్నందున ఆణిముత్యాలు వెలుగులోకి వచ్చారు. జాతీయ పోటీల్లో పాల్గొనున్న రాష్ట్ర సబ్‌జూనియర్ జట్టుకు ఇద్దరు ఎంపికయ్యారు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మెరుపులు మెరిపించడంతో సెలెక్టర్లు వీరిని ఎంపిక చేశారు.

అనేక ఆటల్లో అనంతదే అగ్రస్థానం

రాష్ట్ర క్రీడాపటంలో అనంతపురం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. అనేక క్రీడాంశాల్లో జిల్లా మేటిగా నిలిచింది. జాతీయ క్రీడ అయిన హాకీతో పాటు ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్, జూడో, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫెన్సింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో జిల్లా రాష్ట్రంలోనే ముందుంది. జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో జిల్లా ఆటగాళ్లు పదిమంది వరకు చోటు దక్కించుకుంటున్నారు. గతంలో ఒకటి రెండు స్థానాలకే పరిమితమైన జిల్లా రాష్ట్రంలో శాసిస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆర్డీటీ. అకాడమీలు స్థాపించడంతో పాటు పాఠశాల స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం వల్లే ప్రగతి సాధ్యమైంది. అలాగే జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలన్నీ మన జిల్లాకే దక్కుతున్నాయి. పాఠశాల క్రీడలు, సంఘాలు నిర్వహించే పోటీల్లో వెలుగులీనుతున్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడలో జిల్లాకు చెందిన రాధిక, జగదీష్‌లు జూనియర్ ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనడం విశేషం. బాస్కెట్‌బాల్ క్రీడలో కూడా తొలి మూడుస్థానాల్లో ఒకస్థానం జిల్లాకు దక్కుతోంది. టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్, ఛాంపియన్‌షిప్ పోటీల్లో అనంత ఆణిముత్యాలు మూడు నుంచి ఐదు వరకు పతకాలు సాధిస్తున్నారు. క్రికెట్ ఆటలో వివిధ విభాగాల్లో మన ఆటగాళ్లు విజేతలుగా నిలుస్తున్నారు. దేశవాళీ క్రికెట్ పోటీలకు పలువురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫెన్సింగ్‌లో కూడా మన జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో మాత్రం ఎస్కే విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ జట్లకు పతకాలు అందని ద్రాక్షగా మారాయి.



క్రికెట్‌లో 'పల్లవి'ంచిన ప్రతిభ

గ్రామీణ ప్రాంతానికి చెందిన పల్లవి క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తోంది. అనంతపురం అండర్-16 క్రికెట్ జట్టులో ఓపెనర్ పాత్ర పోషిస్తున్న ఈ బాలికది ధర్మవరం మండలం గొట్లూరు గ్రామం. తండ్రి ప్రోత్సాహంతో బ్యాట్‌పట్టిన ఈ బాలిక అండర్-16, 19 విభాగాల జట్లలో రాణిస్తోంది. ఇటీవల జరిగిన అండర్-19 పోటీల్లో రాణించి స్టాండ్‌బైగా ఎంపికైంది. అండర్-16 రాష్ట్ర జట్టులో చోటు సంపాదించింది. ఓపెనింగ్ బ్యాట్స్‌ఉమెన్‌గా, వికెట్‌కీపర్‌గా పలువురి ప్రశంసలు అందుకుంటోంది. అనంతపురంలో జరిగిన అంతర్ జిల్లా క్రికెట్‌లో పరుగులు సాధించడమే కాకుండా కీపింగ్‌తో అనేక మందిని పెవిలియన్ చేర్చింది. జాతీయ జట్టులో స్థానం సాధించమే తన ధ్యేయమని చెబుతోంది..



తొలిసారిగా ఎంపికైన దిలీప్‌రెడ్డి

గుత్తికి చెందిన దిలీప్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆటలో దిట్ట. పదేళ్లకే మైదానంలో సాధన ప్రారంభించిన ఈ బాలుడు తొలిసారిగా సబ్‌జూనియర్ విభాగంలో తొలిసారిగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జట్టులో లెఫ్ట్‌బ్యాక్ స్థానంలో ఆడే ఈ బాలుడు ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేస్తాడు. సొంత జట్టుకు విజయాలు అందించడానికి అనేక వ్యూహాలతో ప్రత్యర్థి ఆటగాళ్లను బోల్తా కొట్టిస్తాడు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. అనంతపురంలోనే జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో కూడా రాష్ట్ర జట్టును గెలిపిస్తానని దిలీప్ రెడ్డి ధీమా వ్యక్తం చేశాడు.



అనతికాలంలోనే జాతీయస్థాయికి

గుత్తికే చెందిన మరో ఆణిముత్యం మహబూబ్ బాషా కూడా జాతీయస్థాయికి మొదటిసారిగా ఎంపికయ్యాడు. జట్టులో రైట్‌బ్యాక్ స్థానంలో ఆడే ఈ బాలుడు అనతికాలంలోనే జాతీయస్థాయిని అందుకున్నాడు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో అదరహో అనిపించాడు. ఈ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలవడానికి తోడ్పడ్డాడు. దీంతో సెలెక్టర్లు జాతీయ స్థాయికి ఎంపికచేశారు. జాతీయస్థాయిలో కూడా రాణించి అంతర్జాతీయంగా ఎదగాలన్నదే నా కలని పేర్కొన్నాడు. ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ బాలుడి కల నెరవాలని ఆశిద్దాం.

నిష్ణాతులైన శిక్షకులు కావాలి



క్రీడారంగానికి ప్రభుత్వం అందిస్తున్న సాయం అంతంత మాత్రంగానే ఉంది. అంతర్జాతీయ, జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి. క్రీడాకారులే సొంత ఖర్చులు పెట్టుకుని పోటీల్లో పాల్గొనే పరిస్థితి లేదు. దేశం గర్వించదగ్గ క్రీడాకారులు వెలుగుచూడాలంటే మొదట నిష్ణాతులైన శిక్షకులను నియమించాలి.

- వెంకటేశులు, జిల్లా ఒలింపిక్ సంఘ సభ్యుడు

తొలిఅడుగు



క్రీడావికాస కేంద్రాల ఆకృతి

రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పాదుకొల్పడానికి నూతన క్రీడా విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చేసింది. ప్రపంచస్థాయి క్రీడాప్రమాణాలు కల్పించడానికి సిద్ధమవుతోంది. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో రూ. 50 కోట్ల అంచనాతో అధునాతన క్రీడాప్రాంగణం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. మండల కేంద్రాల్లో కూడా ఆధునికమైన క్రీడా వికాస కేంద్రాలు నిర్మించడానికి అంచనాలు తయారు చేసింది. జిల్లాలో మొత్తం ఆరు కేంద్రాల నిర్మాణానికి అంచనాలు సిద్ధంగా చేయగా....ముదిగుబ్బ మినహాయిస్తే మిగిలిన ఐదు మండల కేంద్రాల్లో నిర్మాణానికి మార్గం సుగమమైంది. ముదిగుబ్బలో సేకరించిన భూమి అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా బత్తలపల్లి మండలంలో భూమిని సేకరించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, హిందూపురం, మడకశిరలో క్రీడావికాస కేంద్రాల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నారు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న ఈ కేంద్రాలకు ఒక్కోదానికి రూ. 2 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని కేవలం ఇండోర్ స్టేడియాల నిర్మాణానికే వినియోగిస్తారు. ఈ స్టేడియాల్లో కేవలం షటిల్ బ్యాడ్మింటన్ ఆటే కాకుండా కబడ్డీ, వాలీబాల్ లాంటి అంశాల్లో పోటీలు, సాధనకూ అవకాశముంటుంది. ఈ వికాస కేంద్రం 586 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించడానికి అంచనాలు సిద్ధం చేశారు. ఈ స్టేడియంలో రెండు షటిల్ కోర్టులు, శిక్షకుల గది, కేర్‌టేకర్ గది, క్రీడాకారులు దుస్తులు మార్చుకునే రెండు గదులు, మరుగుదొడ్లు కూడా నిర్మిస్తారు. ఇండోర్ గేమ్‌లే కాకుండా కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడలు కూడా ఆడుకోవడానికి అనుకూలంగా నిర్మిస్తారు. టెండర్లు పిలవగానే ఈ స్టేడియాల నిర్మాణం మొదలవుతుంది. క్రీడారంగంలో ప్రవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని ఆలోచిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో కూడా క్రీడాకారులకు ఉచితంగా విద్య, వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని యువతను శారీరకంగా, మానసికంగా బలోపేతం చేయడానికి ఈ స్టేడియాల నిర్మాణం చేస్తున్నారు. తెలుగు తేజాలు అంతర్జాతీయ యవనికపై సత్తాచాటేలా ఆటగాళ్లను తీర్చిదిద్దడానికి సంకల్పించారు.

మెరుగైన ప్రోత్సాహం అవసరం



గత నెలలో అమెరికాలో జరిగిన ప్రపంచ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఎంతోమంది దాతలు సహాయం అందించడం వల్లే పోటీలకు వెళ్లాను. ప్రధానంగా ఆర్డీటీ సాయం ఎప్పటికీ మరువలేను. అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించాలి. క్రీడల్లో రిజర్వేషన్ శాతం తూ.చ తప్పకుండా అమలు చేయాలి. పేద క్రీడాకారుల ప్రతిభ వెలుగు చూడాలంటే ఇంకా మెరుగైన ప్రోత్సాహం అందించాలి.

- రాధిక, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి

కొత్త క్రీడావిధానంతో ఆణిముత్యాలు వెలుగులోకి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలు చేస్తున్న నూతన క్రీడావిధానంతో గ్రామీణ ఆణిముత్యాలు వెలుగు చూస్తారు. ఈ క్రీడావిధానంతో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. అంతర్జాతీయ వేదికలపై మన రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటుతారు. జిల్లాలో జూడో, బాక్సింగ్ అకాడమీలు కూడా ప్రారంభించడం అభివృద్ధికి సూచిక. జిల్లా కేంద్రంలో ఆధునిక స్టేడియం, క్రీడావికాస కేంద్రాల నిర్మాణం పూర్తయితే క్రీడా పరిమళాలు విరజిల్లుతాయి.

- బాషామొహిద్దీన్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

శుభ్రత పాటించకపోతే ఎలా?

సర్వజన తనిఖీల్లో శిక్షణ కలెక్టర్



సేవల తీరు ఆరా తీస్తున్న వెంకటేశ్వర్

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: 'ఇది ప్రజల ఆస్పత్రి. వార్డులు, వరండాలు ఒక్కటే కాదు... గదుల్లో, యంత్ర సామగ్రి... ఇలా ప్రతి చోటా పరిశుభ్రంగా ఉంచాలి. దేవాలయంలా చూసుకోవాలి. మన నిర్లక్ష్యం చేస్తే రోగుల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుంది. చేసిన పనిని ప్రతిదీ సక్రమంగానే ఉండాలి'...అని శిక్షణ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. రోగులకు ఆహారం వడ్డించేటపుడు చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవడం తెలియదా? ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా? పద్ధతి మార్చుకోండి...అని ఒకింత ఆగ్రహంతో అన్నారు. సోమవారం ఆయన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని సందర్శించారు. తొలుత అత్యవసర విభాగాన్ని (సీవోటీ) చూశారు. అక్కడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఓపీ విభాగాలను నిశితంగా పరిశీలించారు. వైద్యుల హాజరు, రోగులకు అందుతున్న సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. ఏయే ఓపీలో రెగ్యులర్ వైద్యుల హాజరు, ఎస్ఆర్‌లు ఎంత మంది, హౌస సర్జన్లు కూడా ఉంటున్నారా లేదా అన్న దానిపై ఆరా తీశారు. చాలా చోట్లా వైద్యుల హాజరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి నుంచి నేరుగా పోషకాహార పునరావస కేంద్రానికి (ఎన్ఆర్‌సీ) వెళ్లారు. ఇక్కడి వంట గదిని చూశారు. సరకులు ఉన్నాయా లేవా? పిల్లలకు ఏమేం ఇస్తారు. మెనూ పరిస్థితి ఏంటని అడిగారు. పాలు, ఇతరత్రా నిత్యావసర సరకులు ఎక్కడ నిల్వ ఉంచారని అడిగారు. అనవసర వాటిని కూడా ఫ్రిజ్‌లో ఎందుకు పెట్టారంటూ ప్రశ్నించారు. అంతేకాదు... గదిలో అపరిశుభ్రత ఎక్కువ ఉంది. శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఆ తర్వాత పిల్లల తల్లులతో మాట్లాడారు. రోజూ ఏమేం ఆహారాన్ని ఇస్తారని అడిగారు. ఆ తర్వాత పిల్లల వార్డుకు వెళ్లి జ్వరాల కేసులు ఎన్ని నమోదు అవుతున్నాయని అక్కడి సహాయ ఆచార్యుడు సంజీవప్పను అడిగారు. అక్కడి నుంచి ప్రసూతి విభాగం వద్దకు వెళ్లారు. రోగులకు ఆహారాన్ని వడ్డిస్తున్న తీరును చూశారు. కొందరు సిబ్బంది చేతులు గ్లౌజ్‌లు వేసుకోకపోవడంతో పైవిధంగా అసంతృప్తి వెలిబుచ్చారు. ఆయన వెంట ఆస్పత్రి ఇన్‌ఛార్జి వైద్య పర్యవేక్షకుడు ఆచార్య వెంకటేశ్వర్‌రావు, ఆర్థో ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

హిందూపురం

విస్తృత బందోబస్తు

హిందూపురం: పట్టణంలో గురువారం నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జనానికి విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. 30న హిందూపురం వన్‌టౌన్‌లో పోలీస్ బలగాలు రిపోర్టు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆరుగురు డీఎస్‌పీలు, 18 మంది సీఐలు, 78 మంది ఎస్‌ఐలు, 25 మంది ఎఎస్‌ఐలు, 86 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 518 మంది పోలీసులు, 100 మంది హోమ్ గార్డులు, ఏఆర్ కానిస్టేబుళ్లు, ప్రత్యేక పోలీస్ బలగాలను నియమించామన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పథకాలకు గడువు పొడిగింపు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న భారతీ, కాశ్యప పథకాలను సద్వినియోగం చేసుకోవాలనే అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవడానికి సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల సమన్వయకర్త కౌసల్య తెలిపారు. బ్రాహ్మణ కుటుంబాల్లో అర్హులు అదనపు సమాచారం కోసం 8008934407 చరవాణితో సంప్రదించాలన్నారు.


హిందూపురం పట్టణం: బెంగళూరురోడ్డులో..


హిందూపురం పట్టణం: ధరంపురంలో పంచముఖ వినాయకుడు


హిందూపురం పట్టణంలోని కోటలో విద్యాగణపతి


హిందూపురం పట్టణం:శ్రీనివాస నగర్ గణేష్ మందిరంలో..


హిందూపురం పట్టణం: ధనలక్ష్మీరోడ్డులో..


హిందూపురం పట్టణం: లక్ష్మీపురంలో..


లేపాక్షిలో కూరగాయల అలంకరణలో..

బొజ్జ గణపయ్యా.. కరుణించవయ్యా


హిందూపురం పట్టణం: నింకంపల్లి రోడ్డులో..

న్యూస్‌టుడే, హిందూపురం బృందం

వినాయక చవితి సందర్భంగా హిందూపురం పట్టణంలోని పలు వార్డుల్లో కొలువుదీరిన వినాయక ప్రతిమలకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రివేళల్లో మంటపాల వద్ద నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకకుంటున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు మద్దెన లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు శ్రీధర్‌బాబుల విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. పెన్నా నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో నిమజ్జనం చేశారు. చౌళూరు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ కూడలిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని గ్రామ సమీపంలోని చెరువు నీటిలో నిమజ్జనం చేశారు. పూలకుంట, కిరికెర, వినాయకనగర్, కగ్గల్లు, సంతేబిదనూరు తదితర గ్రామాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల కేంద్రం లేపాక్షిలోని బీసీ కాలనీలో ఈడిగ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు సోమవారం కూరగాయల అలంకరణలో భక్తులకు కనువిందు చేశాడు. కల్లూరు, వెంకటాపురం, ఓబుళాపురం, చోళసముద్రం, కంచిసముద్రం తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు.


హిందూపురం మండలం చౌళూరు గ్రామంలో..


ముద్దిరెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలుతూ..


హిందూపురం పట్టణం: శివబాలయోగినగర్ మహిళల ఆధ్వర్యంలో..


బాలకృష్ణ అభిమానుల మధ్య జన్మదిన వేడుకల్లో సతీష్

ఘనంగా నంబూరి జన్మదిన వేడుక

హిందూపురం, న్యూస్‌టుడే: నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు నంబూరి సతీష్ జన్మదిన వేడుకను సోమవారం బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులతో కలిసి ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం సూగూరు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలకృష్ణ అభిమానులు సతీష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మిఠాయిలు పంచి పెట్టారు. చిలమత్తూరు మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. దీనిలో పట్టణ ప్రముఖులతో పాటు ఎన్‌బీకే ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు బండారు బాలాజీ, హెచ్‌ఎన్ రాము, ఆదినారాయణ, సూరి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మరవకొత్తపల్లి (చిలమత్తూరు): ఆల్ ఇండియా ఎన్‌బీకే ఫ్యాన్స్ అధ్యక్షుడు నంబూరి సతీష్ పుట్టినరోజు వేడుకలు మండల యూత్ ఘనంగా నిర్వహించారు. సోమవారం చిలమత్తూరు పంచాయతీ మరవకొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు తదితరాలు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ..

కోడూరు (చిలమత్తూరు): కొద్దిరోజులుగా తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న మండల పరిధిలోని కోడూరు బీసీకాలనీ గ్రామ వాసులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని కోడూరు బీసీకాలనీ వాసులు స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి విషయంలో కూడా కొందరు రాజకీయం చేస్తూ ఎగువన ఉన్నవారికి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని అన్నారు. దిగువ బీసీ కాలనీలో మూడు నెలలుగా ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కోడూరు బీసీకాలనీ వాసులు చెరువులోని బోరుబావి వద్ద నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. మహిళలు, యువకులు చెరువులోకి వెళ్లి తెచ్చుకోగలరని, వృద్ధుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చెరువులోని బోరుబావి వద్ద నుంచి ఒకటి, రెండు బిందెలతో తెచ్చుకునే నీటితో అవసరాలు తీరేదెలా అని వాపోయారు. సర్పంచు బోరుబావిని వేయించడానికి మూడో వార్డు సభ్యుడి ఇంటి దగ్గర పాయింట్‌ను చూడగా.. ఆయన తన ఇంటి దగ్గర వేయకూడదని వాగ్వాదానికి దిగినట్టు తెలిపారు. గ్రామ ప్రజల తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవో శివానంద్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్రమణ్యం, సర్పంచి కుమారుడు శివ త్వరలోనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్టు చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో నూతన బోరుబావి వేయిస్తామని హామీ ఇచ్చారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహిద్దాం

హిందూపురం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహిద్దామని డీఎస్పీ కరీముల్లా షరీఫ్ పేర్కొన్నారు. హిందూపురం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు ఈ నెల 31న నిమజ్జనానికి ఆయా శాఖల పరిధిలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉదయం 9 గంటలకే నిమజ్జనానికి ఏర్పాట్లు చేసుకొని బయలుదేరేలా చర్యలు చేపట్టాలన్నారు. రూట్ మ్యాప్ ప్రకారం విగ్రహాలు తరలించాలన్నారు. ఒంటి గంట నుంచే గుడ్డం కొలనులో నిమజ్జనానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఒక రోజు ముందుగానే మద్యం దుకాణాలను మూసి వేయించాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులకు పట్టణంలో రోడ్లు ఉన్న చోట్ల గోతులు ఏర్పడి ఉంటే వాటిని తక్షణం పూడ్చే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బందిని గజ ఈతగాళ్లను నిమజ్జనం చేసే కొలను వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. కోనేరు వద్ద ఫైర్ ఇంజిన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం పనులు ఎక్కడికక్కడ చేపట్టాలన్నారు. నిమజ్జనం రోజు పరిస్థితులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను బైపాస్ రోడ్డు మీదుగా తిప్పే ఏర్పాట్లు చేయాలన్నారు. గురునాథ్ సర్కిల్ నుంచి కిరికెర క్రాస్ వరకు ఉన్న రింగ్ రోడ్డులో వాహనాలు తిరిగేలా చూసి పట్టణంలోనికి రాకుండా చూడాలన్నారు. సమావేశంలో రెవెన్యూ, ఫైర్, ఎక్సైజ్, విద్యుత్తు, 108, వైద్యం, ఆర్టీసీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


విగ్రహాల రూట్ మ్యాప్ గురించి వివరిస్తున్న సీఐ ఈదురుబాషా

కూరగాయల ధరలు (కిలో.రూ.ల్లో)

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: వంకాయ 30, మిరప 60-70, బీరకాయ 40, గోరుచిక్కుడు 30, బెండకాయ 30, బీన్స్ 40, టమోటా 40, ముల్లంగి 30, కోస్ 20, కాలీఫ్లవర్(ఒకటికి) 20, మునక్కాయలు 60, ఉల్లిపాయలు 40, వెల్లుల్లి 80, ఆలుగడ్డలు 20, బీట్‌రూట్ 40, కాకర 60, క్యారెట్ 60, సొరకాయ 30, క్యాప్సికమ్ 40, పచ్చిబఠాణి 30, ఎండుకొబ్బరి 100, గుమ్మడికాయ 40, దొండకాయ 40, బఠాణి 100, చిక్కుడు 40, పొట్లకాయ 40.

నిత్యావసర వస్తువులు (కిలో రూ.ల్లో)

బియ్యం(సన్నవి) 48, పెద్దబియ్యం 35, రాగులు 40, ధనియాలు 80-110, కందిపప్పు 60-70, పెసళ్లు 120, పెసరబ్యాళ్లు 130, బియ్యపుపిండి 35, జొన్నలు (తెల్లవి) 22, సజ్జలు 20, సెనగలు 80, బెల్లం 50-60, మంచినూనె (వేరుసెనగ) 102, పామాయిల్ 80, గోధుమపిండి 25, గోధుమరవ్వ 50, సెనగపప్పు 75, ఉద్దిపప్పు 120, చెక్కర 42, మైదాపిండి 15, ఎండుమిర్చి 60, అలసందులు 50, ఆటుకులు 40, రాగిపిండి 45.

హిందూపురం

నేడు ముఖాముఖి

పరిగి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్‌ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం పరిగిలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పరిగి ఎంపీడీవో బాలమునయ్య తెలిపారు. హిందూపురం ఎస్‌బీఐ (ఏడీబీ) బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, ఇతర అధికారుల సమక్షంలో ముఖాముఖి ఉంటుందన్నారు.

నంద్యాల విజయంపై తెదేపా సంబరం



విజయోత్సవాలను జరుపుకొంటున్న తెదేపా నాయకులు



కొడికొండలో టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేస్తున్న సర్పంచి



పరిగిలో విజయోత్సవ సంబరాల్లో పార్టీ శ్రేణులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ఫలితాన్ని 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా పునరావృతం చేస్తామని తెదేపా నాయకులు ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపును పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో విజయోత్సవాలను నిర్వహించారు. ప్రజలు సమర్థమైన నాయకత్వాన్ని ప్రోత్సహిస్తారని చెప్పడానికి నంద్యాల ఫలితమే ఉదాహరణ అని బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రంగనాయకులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ, వైస్ ఛైర్మన్ రాము, నాగరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప తదితర నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● **కొడికొండ (చిలమత్తూరు):** నంద్యాలలో తెదేపా ఘన విజయం సాధించడంతో మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సోమవారం ముందుగా కొడికొండ గ్రామంలోని బస్టాండు ఆవరణలో సర్పంచి బాలాజీ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి తమ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ప్రజలకు మిఠాయిలను పంచిపెట్టారు. చిలమత్తూరు బస్టాండ్ ఆవరణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి తెదేపా నాయకుడు అన్సర్ సంబరాలు చేసుకున్నారు.

● **పరిగి:** నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడంపై సోమవారం పరిగిలో తెదేపా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక పైడేటి సర్కిల్‌లో బాణసంచా కాల్చారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు మిఠాయిలు పంచిపెట్టారు. తెదేపా మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సోమప్ప, గోపి, లక్ష్మీనారాయణ, క్రిష్టప్ప, సర్పంచులు ఈశ్వరప్ప, మైలారప్ప, శ్రీనివాసులు, నాయకులు నాగభూషణగౌడ్, సురేష్‌గౌడ్, రవి, పరిటాల యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తాం

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వినాయక ప్రతిమల నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తామని బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రంగనాయకులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ, వైస్‌ఛైర్మన్ రాము పేర్కొన్నారు. గుడ్డం కొలనులో నీరు తక్కువగా ఉండటంతో నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు మున్సిపాల్టీ వారు పీఏబీఆర్ నుంచి వస్తున్న నీటిని ప్రత్యేక పైపులైన్ ద్వారా కొలనులోకి పంపడానికి ఏర్పాట్లు చేశారు. నీటి సరఫరాను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ రమేష్, డీఈ వన్నూరుస్వామి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ విద్యాసాగర్, తెదేపా నాయకులు నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పురం క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభావంతులతో శిక్షకులు

హిందూపురంఅర్బన్, న్యూస్‌టుడే: కేరళలోని వాయ్‌నాడ్ జిల్లా సుల్తాన్‌బత్రెలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన గురురాఘవేంద్ర, సిద్దార్థ్, ప్రవీణ్‌లు ప్రతిభకనబరచి ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు కరాటే శిక్షకులు సన్‌షైన్ ఫైరోజ్ తెలిపారు. రాఘవేంద్ర బ్లాక్‌బెల్ట్ ఫైట్, సిద్ధార్థ కలర్‌బెల్ట్ ఫైట్‌లో ద్వితీయ స్థానాల్లో, ప్రవీణ్ కట్టాలో ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో ఫైరోజ్, గిరిప్రసాద్‌లను ఉత్తమ రెఫరీలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ కరాటే న్యాయమూర్తులు మధు, విశ్వనాథ్, సునిల్‌కుమార్‌లు ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు, ధ్రువపత్రాలు అందించినట్లు వివరించారు.



పరిగిలో ఉలవల కోసం బారులు తీరిన రైతులు

ఉలవలు పంపిణీ

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలో సోమవారం మండలానికి చెందిన బీచిగానపల్లి, శీగుపల్లి, పైడేటి గ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఉచితంగా ఉలవలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 210 మంది రైతులకు 20 క్వింటాళ్ల మేర ఉలవలను పంపిణీ చేశామని ఏఓ టి.చైతన్య తెలిపారు. సోమవారం అత్యధికంగా రైతులు తరలి వచ్చి ఉలవల కోసం బారులు తీరారు. అదనపు కౌంటర్ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండు చేశారు. మంగళవారం పరిగి, హొన్నంపల్లి, శిరేకోళం, నరసాపురం గ్రామాలకు చెందిన రైతులకు ఉలవలను పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

పరిగి వీఆర్‌ఏ మద్దన్న మృతి

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న మద్దన్న(55) ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. వీఆర్‌ఏ మద్దన్న రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో అతడిని చికిత్స కోసం ఆటోలో బంధువులు హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స అందించే లోపే మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. గుండెపోటు వచ్చి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి, రెవెన్యూ సిబ్బంది వీఆర్‌ఏ ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వ సాయంగా రూ.15 వేలు అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శివన్న సంతాపం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తూమకుంట చెక్ పోస్టు (హిందూపురం), న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తూమకుంట చెక్ పోస్టు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(50) మృతి చెందినట్లు సోమవారం ఉదయం సమాచారం అందడంతో ఉదయం వెళ్లి పరిశీలించారు. మృతుడికి చెందిన ఫొటోలను అన్ని స్టేషన్‌లకు గుర్తించేందుకు పంపినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. అతడి చేతిపై పచ్చబొట్టు పెద్ద సైజులో ఉండటం, పట్టణంలోని ఓ అద్దాల దుకాణంలో కంటి అద్దాలు కొనుగోలు చేసినట్లు ఉంది. తూమకుంట నుంచి మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మున్సిపాల్టీ వారికి అప్పగించినట్లు తెలిపారు. అతడు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

కనుమ (చిలమత్తూరు), న్యూస్‌టుడే: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలమత్తూరు పంచాయతీ కనుమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి గాయాలయ్యాయి. ఎస్‌ఐ జమాల్‌బాష తెలిపిన వివరాల మేరకు... ట్రాక్టర్ కంకర లోడుతో కనుమ నుంచి చిలమత్తూరుకు బయలుదేరింది. చిలమత్తూరు నుంచి హిందూపురానికి ద్విచక్రవాహనంపై గుర్తుతెలియని వ్యక్తి వెళుతున్నాడు. అతడు కనుమ మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ఆ వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హిందూపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ప్రశాంత బక్రీద్‌కు అందరూ సహకరించండి

హిందూపురం, న్యూస్‌టుడే: సామరస్యంగా బక్రీద్ పండగ జరుపుకొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ కరీముల్లా షరీఫ్ పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం ముగిసిన వెంటనే వచ్చే నెల 2న బక్రీద్ పండగ నేపథ్యంలో బహిరంగంగా పశువులను ఊరేగించడం, హింసించడం చట్టరీత్యా నేరమన్నారు. అలా ఎక్కడైనా చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనే ప్రయత్నం చేయవద్దని, దీంతో అల్లర్లకు ఆస్కారం ఉంటుందన్నారు. పండగ రోజు ద్విచక్ర వాహనాల్లో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మాంసం తీసుకెళ్లే అలవాటును మానుకోవాలన్నారు. స్థానికంగా పంచుకోవడం ఆనవాయితీ కాబట్టి అలా చేస్తే బాగుంటుందన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యతగా మెలగాలన్నారు. ఎక్కడైనా వివాదాలు తలెత్తితే పోలీస్ శాఖ తన పని తాను చేసుకుపోతుందన్నారు. మత పెద్దలు ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజెప్పి ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకొనేలా చూడాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కరీముల్లా షరీఫ్

CLASSIFIEDS

BIRTHDAY GREETINGS



Novel Wheel Care
శివగంగ కాంప్లెక్స్, బళ్ళారిరోడ్, ATP.
Cell: 9701090535

AGRIBUSINESS

WANTED GLADIATOR Rose Plants. Contact Cell Number: 85005 27809.

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Ashok Leyland Tanker with 12 KL Capacity in Running Condition of 1997 Make is Ready for Sale at Hindupur. Contact: 93900 20348.

వెహికల్ ఫర్ సేల్: JCB 2009 మోడల్ కిర్లోస్కర్ ఇంజన్, మహీంద్రా 275 2010 మోడల్ ట్రాక్టర్, మహీంద్రా జైలో D2 2011 మోడల్ ఎల్లోబోర్డ్ లైఫ్ ట్యాక్స్ 2028 వరకు. Contact: 9704484693, 9052921616.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

Area Wise Dealers Wanted For ORPAT Fan's Low Investment High Returns Cont Deepak 7013364604, 9246540514.

BUSINESS OFFER

అనంతపురంలో రన్నింగ్‌లో ఉన్న స్కూల్ కొరకు పార్ట్‌నర్ కావలెను. ఖచ్చితమైన ఆదాయం సురక్షితం, సంప్రదించండి. Ph: 8886136002

PACKERS & MOVERS

శ్రీదుర్గా ప్యాకర్స్ & మూవర్స్. మీరు ఇల్లు మారుతున్నారా? వెంటనే సంప్రదించండి. All Over India. Office 3rd రోడ్, సాయిబాబా గుడి దగ్గర. Ph: 9849126992, 08554-230992.

EDUCATION

DMLT (ల్యాబ్ టెక్నీషియన్) 2 సం॥ ల కోర్సునకు గత 20 సం॥ల నుంచి అద్భుత విజయాలు సాధిస్తున్న SEEDS పారా మెడికల్ కాలేజ్ నందు 2017-18 సం॥ నకు అడ్మిషన్లు జరుగుచున్నవి. అర్హత ఏదైనా ఇంటర్ పాస్. అర్హులైన SC, ST, BC, EBC, మైనార్టీలకు స్కాలర్‌షిప్ కలదు. కొన్ని సీట్లు మాత్రమే కలవు. సంప్ర: డా॥ A.కేశన్న, SEEDS పారా మెడికల్ కాలేజ్, కమలానగర్, ATP. Cell: 9440255034, 7330865311.

HEALTH CARE

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యంలేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర॥ 96030 55647,79953 92747.

PERSONAL CLASSIFIEDS

MISSING

కనబడుటలేదు



వి.యువరాజు, వయస్సు: 21
డోర్‌నెం.8/115, కోటవీధి,
అమరాపురం, అనంతపురం జిల్లా

బాబు.. నీవు ఇల్లు వదలి వెళ్లినప్పటి నుండి మీ అమ్మ ఆరోగ్యం బాగాలేదు. సీరియస్‌గా ఉంది. ఈ ప్రకటన చూసిన వెంటనే రాగలవు.

దయచేసి ఈ ఫోటోలో ఉన్న వ్యక్తి కనబడినచో క్రింది నెంబర్లకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాము.

సి.ఐ. 1 టౌన్: 9440796804
యస్.ఐ 1 టౌన్: 8555052803 9440221582
తండ్రి వీరశేఖరాచారి 9490856427 9701766464

REAL ESTATE

HOUSE FOR SALE

అనంతపురం RTC బస్టాండుకు అతి సమీపంలో 2.5 సెంట్లలో 2 BHK హౌస్, 42 Lakhsకు కట్టించి ఇవ్వబడును. Only One ప్లాటు మాత్రమే కలదు. సంప్ర॥ 9966738330, 9949999621.

JOBS

TV 24x7 న్యూస్ ఛానల్‌లో పనిచేయుటకు న్యూస్ రిపోర్టర్స్ కావలెను. Q: ఇంటర్/ డిగ్రీ. జీ: 18,000 ✆ 9676452995/ 9553308421.

కావలెను: పెనుకొండ V.K.Wines నందు పనిచేయుటకు 18 నుండి 40 సం॥లు వయసుగలిగి చురుకుగా, చలాకీగా ఉన్న అభ్యర్థులు కావలెను. సంప్ర॥ 9440431355, 9848598859.

కళ్యాణదుర్గంలో శ్రీ వాసవి డెంటల్ క్లినిక్ నందు పనిచేయుటకు స్త్రీ అభ్యర్థులు కావలెను. సంప్రదించండి. 9985897927.

ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికెట్ కలిగి, అనుభవం కలిగిన పెనుకొండ ప్రాంతీయులు కావలెను. జీతము 8000/- మరియు బ్యాడ్జ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు కావలెను. 7396778592, 9966712149.

మన ఆటోమొబైల్స్, రాంనగర్, ATP నందు పనిచేయుటకు సర్వీస్ సీనియర్ సూపర్‌వైజర్స్, మెకానిక్స్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సెల్: 9849061889.

Wanted Branch Managers for a Reputed Insurance Co., for Anantapur. EQ: Degree/MBA. Age: 30+Y. Exp. 5 Years in Pharma/FMCG/ Mktg. Salary: 37,500 - 50,000/- + Incentive. Contact: Y.V.Nanda Kishore, Cell: 9642990535.

జిల్లా అంతా డోర్ to డోర్ మార్కెటింగ్ చేయించుటకు మేనేజర్స్ కావలెను. జీతం 10,000 + ఇన్సెంటివ్ + రూం ఫ్రీ Ph: 8639647355, 7893867949.

Driver cum assistant, Minimum exp 5 yrs Receptionist, exp 3 yrs in comp operation, Tally, hotel online bookings Contact: 8374043361.

ప్రముఖ కంపెనీలలో పనిచేయుటకు, సూపర్‌వైజర్స్, హెల్పర్స్, ITI ఆల్‌ట్రేడర్స్, ప్యాకర్స్ వెంటనే కావలెను. జీ: 17వేలు+OT, రూం+భోజనం ఫ్రీ. Q: 5th- ఏదైనా డిగ్రీ. Ph: 7097123055, 7097422984.

షిప్‌పై ఉద్యోగం 10th పాస్ అయినా యువకులు మర్చంట్ నేవీలో చేరండి మంచి ఉద్యోగం ఉత్తమ జీతము వయస్సు 17-25 సం.లు Call: 09632199883

మీజిల్లాలోని కంపెనీలలో Job చేయుటకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, ITI ఆల్ ట్రేడ్స్ కావలెను. జీతం 17 వేలు, OT కలదు. బోనస్ 2 వేలు. రూము+ భోజనం ఫ్రీ. 9618961130, 8125188478.

మీజిల్లాలోని కంపెనీలలో వర్క్ చేయుటకు హెల్పర్స్, సూపర్‌వైజర్స్, మేనేజర్స్, ITI (ఆల్ ట్రేడ్స్) వారు కావలెను. జీతం 13 నుండి 16 వేలు, బోనస్ 2 వేలు, రూము+ భోజనం ఫ్రీ. 8886418433.

నర్సింగ్‌స్టాఫ్ కావలెను: ప్రముఖ చిన్న పిల్లల నర్సింగ్‌హోం నందు పనిచేయుటకు GNM నర్సింగ్‌లో అనుభవం (చిన్న పిల్లల హాస్పిటల్‌లో పనిచేసినవారు) కావలెను. Cont: 9701022122.

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలలో డైరెక్ట్ జాబ్ సూపర్‌వైజర్లు, వర్కర్స్, ప్యాకింగ్‌బాయ్స్ కావలెను. జీతం: 13,000- 17,000 రూమ్+ భోజనం ఫ్రీ ✆ 70952 64342, 70952 64386.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



వెలుతురు ఉండగానే నిమజ్జనం



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, అధికారులు

- శింగనమల చెరువు వద్ద కార్యక్రమం
- డీఎస్పీ మల్లికార్జునవర్మ వెల్లడి


ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: వినాయక చవితి వేడుకల్లో ఆఖరి ఘట్టమైన నిమజ్జనం కార్యక్రమాన్ని వెలుతురు ఉండగానే నిర్వహించుకోవాలని డీఎస్పీ మల్లికార్జునవర్మ సూచించారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించే వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతలకు సంబంధించిన నిబంధనలను ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రతిమలను శింగనమల చెరువులో నిమజ్జనం చేసే అవకాశం కల్పించామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు లోపు నిమజ్జనం కార్యక్రమాన్ని ముగిసేలా ఉత్సవ కమిటీలు, నగర ప్రజలు సహకరించాలన్నారు. ఊరేగింపులను తాడిపత్రి బస్టాండ్ సమీపంలోని చెరువు కట్ట వరకే అనుమతిస్తారన్నారు. అక్కడి నుంచి ప్రతిమతో పాటు నలుగురు మాత్రమే చెరువు వరకు వెళ్లాలన్నారు. రహదారి ప్రమాదాలు, రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెండు, మూడు అడుగుల వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి ఆర్డీవో అధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నగరంలో ఊరేగింపుగా తీసుకొచ్చిన ఈ ప్రతిమలను చెరువు కట్ట వద్ద ఉండే ప్రత్యేక బృందాలు తమ వాహనాల్లో తీసుకెళ్తారన్నారు. వీటిని శింగనమల చెరువులో ఆర్డీవో ఆధ్వర్యంలో నిమజ్జనం చేస్తారన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఊరేగింపును సీసీ కెమెరాల ద్వారా పోలీసు అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. మంగళవారం పూర్తిగా మద్యం దుకాణాలను మూసేయాలన్నారు. ఊరేగింపు వాహనాల్లో, నిమజ్జనం ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్థులు ఉండరాదన్నారు. నిమజ్జనం కార్యక్రమానికి 750 మంది పోలీసులు బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. నగరంలోని అన్ని వర్గాల ప్రజలు నిమజ్జనం కార్యక్రమానికి సహకరించాలన్నారు.

అంతా సిద్ధం

శింగనమల, న్యూస్‌టుడే: గణనాథుడి నిమజ్జనానికి శింగనమల చెరువులో పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం నుంచి తీసుకొచ్చే వినాయక విగ్రహాలను శింగనమల చెరువులోని మరవ కొమ్మ వద్ద నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండు ప్రదేశాల్లో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండు క్రేన్లు ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నారు.

వాహనాలను వరుసగా తరలించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు సమస్య రాకుండా ప్రత్యేకంగా దీపాలు అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. నలుగురు డీఎస్పీలు, పది మంది సీఐలు, ఏడుగురు ఎస్సైలతో పాటు 700లకు పైచిలుకు కానిస్టేబుళ్లను నియయించినట్లు వివరించారు. భక్తులకు తాగునీటి సౌకర్య కల్పిస్తున్నామన్నారు.

నంద్యాల ఓటర్లు అభివృద్ధికి పట్టం కట్టారు



మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నికలో అక్కడి ఓటర్లు అభివృద్ధికి పట్టం కట్టారని తెదేపా జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే బీకే పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పెనుకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికలో ప్రతిపక్షనాయకుడు జగన్మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆయన వ్యవహార శైలి బాగోలేదని తెలిపారు. సమర్థ నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ప్రతిపక్షనాయకుడి హోదాలో జగన్మోహన్‌రెడ్డి దుర్భాషలాడడం సరైనది కాదని పేర్కొన్నారు. ఓటర్లు ఆయనకు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి సైతం నియోజకవర్గ అభివృద్ధికి తెదేపాలోకి చేరారని గుర్తు చేశారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి నంద్యాలలో ఇళ్లు, రహదారులు అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తెదేపా అభ్యర్థికి ఓట్లువేసి గెలిపించారని చెప్పారు. 2019 ఎన్నికల్లో తెదేపా విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సర్పంచి అశ్వర్థనారాయణ, తెదేపా నాయకులు శ్రీరాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జెరూసలేం యాత్రకు దరఖాస్తులు

కోవూరునగర్(అనంతపురం): క్రైస్తవుల పవిత్ర స్థలమైన జెరూసలేం యాత్రతోపాటు ఇతర ప్రదేశాలను సందర్శించేందుకు ఆసక్తి కలిగిన క్రైస్తవులు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్(మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వహణ అధికారి బాబాతాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర ఎనిమిది రోజులపాటు ఉంటుందన్నారు. యాత్రకు రూ.83,709 ఖర్చు అవుతుందని, సంవత్సర ఆదాయం రూ.3 లక్షలలోపు ఉన్నవారికి రూ.40 వేలు రాయితీ, రూ.3లక్షల కంటే ఆదాయం ఉంటే రూ.20 వేల రాయితీని కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందజేస్తుందని ఆయన వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులకు పాసుపోర్టు ఉండాలని తెలిపారు. www.christianminorities.ap.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-246615, 7396284529 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్పాన్సర్ కోటాకు గడువు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో ఎంటెక్, ఎంఫార్మసీ స్పాన్సర్ కోటా కింద దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబరు 11 వరకు గడువు నిర్ణయించామని ప్రవేశాల సంచాలకులు ఆచార్య విజయ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సాహితీవేత్తలకు పురస్కారం




రమేష్‌నారాయణ, ప్రేమ్‌చంద్



రాధేయ

అనంత సాంస్కృతికం: జిల్లాకు చెందిన ముగ్గురు సాహితీవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం మాతృభాష పురస్కారాలను ప్రకటించింది. తెలుగు భాషాభివృద్ధికి వీరు చేసిన కృషికి గాను ప్రభుత్వం పురస్కారాలను అందజేయనుంది. ప్రముఖ రచయిత, అనువాదకులు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌నారాయణ, ప్రముఖ కవి రాధేయ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, కవి డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్ ఎంపికయ్యారు. ఈనెల 29న గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని విజయవాడ కళాక్షేత్రంలో నిర్వహించే మాతృభాష దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నుంచి పురస్కారాలు అందుకోనున్నారు.

పేదను కొట్టు.. పెద్దకు పెట్టు!



పెనుకొండలోని అర్బన్ కాలనీ సమీపంలో ఇంటి పట్టాల స్థలంలో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో భాగంగా లబ్ధిదారులకు గృహాలను నిర్మిస్తున్నారు. అయితే వీటిలో ఎక్కువ భాగం పెనుకొండ పంచాయతీకి చెందిన కొందరు వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధుల బంధువులు లబ్ధిదారులుగా ఉన్నారు. కొందరికి గృహాలు ఉన్నా మళ్లీ ఇల్లు నిర్మించుకొంటున్నారు. అయితే గృహ నిర్మాణ శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి) పథకంలో 6,900 గృహాలు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వం పక్షాన మంజూరైన పీఎంఏవై ఒక్కొక్క గృహ నిర్మాణానికి రూ.2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో ఒక్కొక్క ఇంటికి రూ.1.5 లక్షలు లబ్ధిదారులకు అందజేస్తారు. ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో ఆయా మండల తహసీల్దార్, ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖ ఏఈ తదితరులు ఎండీటీ బృందాలుగా ఏర్పడి, జన్మభూమి కమిటీలతో కలిసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అదేవిధంగా పీఎంఏవైజీ పథకంలో సైతం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టడానికి గ్రామసభలను చేపట్టాలి.

అయిన వారికే అందలం...

గృహ నిర్మాణ శాఖాధికారులు గ్రామసభలను నిర్వహించామని చెబుతున్నా లబ్ధిదారుల ఎంపికలో పెద్దలకే పెద్దపీట వేశారు. ముఖ్యంగా ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో పెనుకొండ డివిజన్‌లోని మండలాల్లో రాజకీయ ఒత్తిళ్లకు, జన్మభూమి కమిటీల ఆధిపత్యానికి లోబడి ఎక్కువ భాగం లబ్ధిదారుల ఎంపిక జరిగింది. కొందరు ప్రజాప్రతినిధులు, ధనికులు, అధికార పార్టీ నాయకులకు, వారి బంధువులకు ఎక్కువ భాగం గృహాలను మంజూరు చేశారు. డివిజన్‌లో 50 శాతం ఇదే పరిస్థితి నెలకొనగా.. పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 60 శాతం గృహాలు అనర్హులకు మంజూరు చేశారు. దీంతో అర్హులైన పేదలు ఇంటి పట్టాల కోసం, ఇళ్ల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

11 వేల మందికిపైగా నిరీక్షణ..

డివిజన్‌లోని ఐదు నియోజకవర్గాల్లోని మండలాల్లో దాదాపు 11 వేల మందికిపైగా సొంతిళ్లు లేని పేదలు ఉన్నారు. గత ప్రభుత్వంలో సైతం ఇంటి పట్టాలు పొంది గృహాలు మంజూరు కాక నిర్మించుకోలేని పేదలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారు. నెలనెలా రూ.వేలకు వేలు బాడుగులు వెచ్చించి జీవిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరు అవుతాయని ఆర్తిగా ఎదురుచూస్తున్నారు. రెండో విడతలో డివిజన్ వ్యాప్తంగా 2 వేల మందికిపైగా లబ్ధిదారులను గుర్తించి గృహ నిర్మాణ శాఖాధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

అధికారమే అండగా..

పెనుకొండ డివిజన్‌లోని మండలాల్లో అధికారమే అండగా పీఎంఏవై, ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకంలో లబ్ధిదారుల ఎంపిక జరిగింది. సంబంధిత ఎమ్మెల్యేలు మండల స్థాయి నాయకులకు, జన్మభూమి కమిటీల వారికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అప్పగించారు. ఇదే అదనుగా సంబంధిత అధికార పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల వారు ఇష్టానుసారం అధికారులతో లబ్ధిదారుల ఎంపికను చేపట్టారు. కొందరు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వారి వారి బంధువులకు, తెలిసిన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయించారు. ముఖ్యంగా పెనుకొండ నియోజకవర్గంలోని మండలాల్లో జన్మభూమి కమిటీల వారు, మండల స్థాయి నాయకులు సూచించిన వారినే ఎక్కువభాగం లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. దీంతో పేదలకు మొండిచెయ్యి మిగిలింది.

అనర్హులను గుర్తించి చర్యలు తీసుకుంటాం

- చంద్రమౌళిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఈఈ

పీఎంఏవై, ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణం పథకం లబ్ధిదారులను ఆయా మండలాల ఎండీటీ బృందాలు, జన్మభూమి కమిటీల వారు గ్రామసభలను నిర్వహించి ఎంపిక చేశారు. ఇందులో భాగంగానే డివిజన్‌లో గృహాలను మంజూరు చేశాం. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఆధారంగా పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక జరిగింది. అనర్హులైన లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేసి ఉంటే వాటిని గుర్తిస్తాం. సమగ్రంగా పరిశీలించి పరిశీలించి చర్యలు తీసుకొంటాం. అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం.

ఒత్తిళ్లు.. కుమ్మక్కుతో...

ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారుల ఎంపికకు తహసీల్దార్, ఎంపీడీవో, గృహనిర్మాణశాఖ ఏఈల తోపాటు, జన్మభూమి కమిటీల వారు ఎండీటీ బృందాలుగా ఏర్పడి గ్రామసభలను నిర్వహించాలి. అదేవిధంగా పీఎంఏవై పథకంలో సంబంధిత గ్రామ పెద్ద లేదా సర్పంచి ఆధ్వర్యంలో గృహనిర్మాణశాఖ ఏఈలు గ్రామసభలను చేపట్టి లబ్ధిదారుల ఎంపిక చేయాలి. అయితే కొన్ని మండలాల్లో గృహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో చేసేదిలేక నాయకులు, జన్మభూమి కమిటీల వారు ఇచ్చిన పేర్లనే లబ్ధిదారుల జాబితానే రూపొందించారు. మరికొన్నిచోట్ల గృహ నిర్మాణ శాఖ ఏఈలు, డీఈలు, జన్మభూమికమిటీల సభ్యులతో కుమ్మకై లబ్ధిదారుల జాబితాలో అనర్హులకు పెద్దపీట వేశారు.

నియంత్రికలకు సీల్ వేయిస్తాం

(మొదటి పేజీ తరువాయి) ప్రధాన సంచికలో 'సీల్... అక్కడే గోల్‌మాల్' శీర్షికన ప్రచురితమైన కథనానికి శాఖ సీఎండీ హెచ్.వై.దొర స్పందించారు. ఈకథనంలో పేర్కొన్న అంశాలపై విచారణ జరిపి నివేదికను ఇవ్వాలని ఆదేశిస్తూ ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ పుల్లారెడ్డి పర్యవేక్షణలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం డైరెక్టర్ పుల్లారెడ్డి, ఎస్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ (జీఎం) శ్రీనివాసులు, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ ఆర్.ఎన్.ప్రసాద్‌రెడ్డి, అనంతపురం సర్కిల్ కన్‌స్ట్రక్షన్ డీఈ రవీంద్రకుమార్, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ సంపత్‌కుమార్ అనంతపురంలోని బళ్లారిరోడ్డులో ఉన్న నియంత్రికల మరమ్మతు కేంద్రానికి (ఎస్పీఎం) వచ్చారు. హెచ్‌వీడీఎస్ కింద షిర్డీ సాయి కంపెనీకి సంబంధించి క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన కొన్ని నియంత్రికలను పరిశీలించారు. ఈ మేరకు రాప్తాడు సమీపంలోని గాండ్లపర్తిలో ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన 16కేవీ నియంత్రికతో పాటు, షిర్డీ సాయి కంపెనీకి చెందిన డంపింగ్ కేంద్రంలో ఉన్న మరో 16 కేవీ నియంత్రిక, 25 కేవీ నియంత్రికలను జిల్లా యంత్రాంగం ఎస్పీఎంకు తరలించారు. ఆపై వాటిని తెరిచి కమిటీ సభ్యులు క్షుణ్నంగా పరిశీలించారు.

కంపెనీదే బాధ్యత...

ఈ సందర్భంగా డైరెక్టర్ పుల్లారెడ్డి మాట్లాడుతూ, ఆర్ఈసీ పథకం కింద అనంతపురం, కర్నూలు సర్కిళ్ల పరిధిలో హెచ్‌వీడీఎస్ పథకం అమలవుతోందని తెలిపారు. ఈ పథకంతో పాటు ప్రపంచ బ్యాంకు నిధులతో భవిష్యత్తులో ఏర్పాటు చేయనున్న నియంత్రికలు అన్నింటికీ శాఖాపరంగా సీల్ వేయించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. హెచ్‌వీడీఎస్ కింద చేపట్టిన పనులపై శాఖాపరంగా తనిఖీలు చేయటంతో పాటు మూడో సంస్థతో (థర్డ్ పార్టీ) కూడా పరిశీలన జరిపిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన నియంత్రికలకు సీల్ వేసేలా అగ్రిమెంట్‌లో లేదనీ.. ప్రతి నియంత్రికకు నాలుగువైపులా యాంటీ థెఫ్ట్ బోల్ట్స్ సదరు యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎవరూ నియంత్రికను పగలగొట్టకుండా యాంటీ థెఫ్ట్ బోల్టులు ఏర్పాటు చేశారనీ.. వీటిని తొలగించలేరని తెలిపారు. ఒకవేళ నియంత్రిక కాలితే యాంటీ థెఫ్ట్ బోల్టులను విరగ్గొట్టి నియంత్రికను తెరవాల్సి ఉంటుందన్నారు. హెచ్‌వీడీఎస్ పథకానికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రతి నియంత్రికకు ఐదేళ్లపాటు గ్యారెంటీ ఉంటుందనీ. . ఈ కాలంలో నియంత్రిక కాలితే సదరు కంపెనీ యాజమాన్యమే కొత్త నియంత్రికను తిరిగి ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. రైతు పొలంలో కాలిన నియంత్రికను తీసుకువచ్చి తీసుకుపోయే బాధ్యతతో పాటు కాలిని దాని స్థానంలో కొత్తనియంత్రికను ఏర్పాటు చేసే బాధ్యత సదరు కంపెనీదేనని తెలియజేశారు. హెచ్‌వీడీఎస్ కింద ఏర్పాటు చేసిన 16కేవీ, 25కేవీ నియంత్రికలకు చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. ఈ నియంత్రికల పొడవు, వెడల్పులు వేరు వేరుగా ఉంటాయనీ.. ఈ క్రమంలో ఒక దానిలో పట్టే సామగ్రి మరొక దానిలో ఇమడదని తెలిపారు. హెచ్‌వీడీఎస్ ద్వారా ఏర్పాటయ్యే నియంత్రికల్లో నాణ్యతపరంగా లోపాలున్నాయని ఫిర్యాదులు అందడంతో తనిఖీ చేశామనీ.. ఈ ఫిర్యాదుల్లో లోపాలు తేలలేదని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్పీడీసీఎల్ కర్నూల్ జోన్ సీఈ పీరయ్య, అనంతపురం విద్యుత్తుసర్కిల్ ఎస్ఈ వరకుమార్, విజిలెన్స్ డీఈ జయరాజ్, క్వాలిటీ కంట్రోల్ డీఈ రవికుమార్, సీఐ సుబ్బరాయుడు, కన్‌స్ట్రక్షన్ ఏడీఈలు లక్ష్మీనారాయణరెడ్డి, మహేష్, ఎస్‌బీఎం ఏడీఈ హనుమంతరాయుడు, ఏఈ రంగస్వామితోపాటు సదరు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం!

(మొదటి పేజీ తరువాయి) విద్యుత్తు కనెక్షన్ కావడంలో చనిపోయిన వారికి పరిహారం కూడా వచ్చే అవకాశం లేదని తెలిసింది.

ఎందుకింత నిర్లక్ష్యం...: వినాయక మండపాల ఏర్పాటు సమయంలో విద్యుత్తు కనెక్షన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలనీ.. వీటిని పక్కాగా పరిశీలించాలని పోలీసులు కొన్ని రోజుల ముందు నుంచి విద్యుత్తు శాఖ అధికారులకు చెబుతూనే ఉన్నారు. ఈసారి జిల్లాలో 6,250 మండపాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అందులో కేవలం 1,500 మండపాలకే అధికారికంగా తాత్కాలిక విద్యుత్తు సదుపాయం తీసుకున్నట్లు తెలిసింది. మిగిలిన మండపాలన్నీ అనధికారికంగా విద్యుత్తును వినియోగిస్తున్నాయి. వాస్తవానికి మండపానికి విద్యుత్తు సదుపాయం పొందాలంటే కొంత నామమాత్ర ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. అలాగే మండపాలు మూడు, ఐదు, ఏడు, తొమ్మిది రోజులు కొనసాగేలా ఏర్పాటు చేస్తుంటారు. ఆయా రోజుల మేరకు ఫీజు ఉంటుంది. ఇది కేవలం రూ.వందల్లోనే ఉంటుంది. అయినా సరే ఆ మొత్తం కూడా నిర్వాహకులు చెల్లించకుండా అక్రమంగా విద్యుత్తును వినియోగించి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అయితే ప్రతి... మండపానికి విద్యుత్తు ఎక్కడి నుంచి వినియోగిస్తున్నారనేది ఆ శాఖ సిబ్బంది పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ కనెక్షన్ తీసుకోకపోతే, వారి ద్వారా తాత్కాలిక కనెక్షన్ తీసుకునేలా చేయాలి. ఒకవేళ అనుమతి తీసుకొని ఉంటే.. ఎలాంటి జాగ్రత్తలు పాటించారనేది పరిశీంచాలి. అయితే దాదాపుగా ఇలా ఎక్కడా జరగడం లేదు. వరుస ఘటనలతో జిల్లాలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడంపై ఎస్పీ అంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. తాము ముందు నుంచి చెబుతున్నా ఎస్పీడీసీఎల్ అధికారులు పట్టించకకపోవడంపై ఆ శాఖ ఉన్నతాధికారులకు తాఖీదు పంపినట్లు తెలిసింది. జిల్లాలో ఇప్పటికే కొన్ని మండపాల్లో విగ్రహాలను నిమజ్జనం చేయగా ఇంకా కొన్ని రోజులపాటు కొనసాగే మండపాల విషయంలో అయినా వెంటనే తనిఖీలు జరిపించాలంటూ అందులో సూచించినట్లు తెలిసింది.

గేట్, జీప్యాట్‌కు హాజరు

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూలో పీజీ ఈసెట్ ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి గేట్, జీప్యాట్ ర్యాంకులకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ముగిసింది. మొత్తం 156 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సెప్టెంబరు 1న స్పెషల్ కేటగిరీ అభ్యర్థులకు తొలిసారిగా జేఎన్‌టీయూలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రవేశాల సంచాలకులు విజయ్‌కుమార్ తెలిపారు. 2 నుంచి 7వ తేదీ వరకు ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

ఉత్తమ ఉపాధ్యాయ దరఖాస్తుకు గడువు పొడిగింపు

అనంతపురం విద్య: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించామని డీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఈనెల 30లోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికైన వారికి సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః

భాష గెలవాలి.. భావం మురవాలి

❐ తెలుగును బతికించేందుకు పరిశో'ధనం' ❐ ఖండాంతరాల్లో ఖ్యాతి

న్యూస్‌టుడే-ఎస్.కె.విశ్వవిద్యాలయం

తెలుగుకు ఏ విధమైన అవకాశాలు లేవని, కేవలం ఉత్తీర్ణత కోసం.. ఐచ్ఛికం కోసం మాత్రమే ఉపయోగించే వారు ఉన్నారు. కొందరు యువత మాత్రం తెలుగు జపం చేస్తున్నారు. పీజీ పూర్తి చేసి అత్యున్నత డిగ్రీ వరకు తెలుగుతోనే జీవితం, తెలుగే వెలుగంటూ ముందుకు సాగుతున్నారు. అమ్మభాషలో అందరి కంటే మిన్నగా, ఖండాంతరాలు దాటినా అవకాశాలు ఉన్నాయని చాటి చెబుతున్నారు. వారి ప్రతిభను విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ)గుర్తించి రూ. లక్షలు ఫెలోషిప్ అందిస్తూ ప్రోత్సహిస్తోంది. 'బాస చేశాం.. భాషను బతికిస్తాం' అంటూ తెలుగుకు జీవం పోయడంతో పాటు అచ్చమైన పల్లెసీమ సంస్కృతి, జానపదం, అంతరించి పోతున్న భాష, గ్రామాల్లో నిరక్ష్యరాస్యుల గుండెల నుంచి పాడుకొనే పాటలకు పదిలం చేసే దిశగా పరిశోధనలకు ఉపక్రమించారు.

నేడు తెలుగు దినోత్సవం

తొలిసారిగా యూజీసీ గుర్తింపు

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం సాధారణంగా సైన్సు గ్రూపులకు మాత్రమే అవకాశం కల్పిస్తుండగా. . తొలిసారిగా 2010లో జేఆర్ఎఫ్ ఫెలోషిప్స్‌కు అవకాశం కల్పించింది. యూజీసీ ఇచ్చిన అవకాశాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు తులనాత్మక సాహిత్య శాఖ విద్యార్థులు అందిపుచ్చుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే నెట్ పరీక్షల్లో సైతం అర్హత సాధించి ఔరా అనిపిస్తున్నారు. తాజాగా తెలుగు విభాగంలోనే జూనియర్ రీసెర్చి ఫెలోషిప్ పొందుతున్న వారు 12 మంది ఉన్నారు. ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 25 వేలు ఫెలోషిప్స్ ఇస్తున్నారు. సీనియర్ రీసెర్చి ఫెలోషిప్ నలుగురు విద్యార్థులు పొందుతుండగా నెలకు రూ.28 వేలు చొప్పున ప్రోత్సాహం అందుతోంది. పోస్టుడాక్టరల్ ఫెలోషిప్ ఐదుమంది పొందుతున్నారు. నెలకు రూ. 38 వేలు చొప్పున ఐదేళ్ల పాటు వీరికి అందుతుంది. తెలుగు భాషా, తెలుగు సంస్కృతి, తెలుగు పురాణాలు, ఇతిహాసాలు.. ఇలా అన్ని అంశాలు తెలుగుకు మిళితం అయిన వాటిలోనే యువత పరిశోధనలు చేయాల్సి ఉంటుంది.

వెలుగులోకి శాసనాలు



నరేష్‌కుమార్


ఎస్కేయూలోని తెలుగు తులనాత్మక అధ్యయన శాఖలో పోస్టు డాక్టరల్ ఫెలోషిప్‌గా ఉన్న డాక్టర్ నరేష్ కుమార్‌నాయక్ ప్రాచీన కాలంలో తెలుగు వెలుగుకు సంబంధించిన ఆనవాళ్లు గుర్తించారు. పుట్టపర్తి మండలం పెడబల్లిలో తెలుగు శాసనాలను కనుగొన్నారు. ఆయా ప్రాంతాల్లో తెలుగు అగ్రహారం ఉండేదని, తిరుపతి అనే గ్రామం ఉండేదని ఆనవాళ్లు గుర్తించారు. తిరుపతికి అనుసంధానంగా శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఆ అగ్రహారంలో తెలుగు వెలుగులు విరాజిల్లినట్లు గుర్తించారు. శాసనాలు దాదాపు 9వ శతాబ్దానికి చెందినవని, అప్పట్లో ప్రాకృతభాష ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, ఈ అంశంపై ఆయన పరిశోధనలు చేస్తున్నారు. తెలుగు, గిరిజన భాషలపై అనేక పరిశోధనా పత్రాలు ప్రచురించారు. బంజారా భాషకు లిపి లేక పోవడంతో లిపి నిర్మాణం గుర్తించారు. ఏడు పుస్తకాలు, 35 జాతీయ సదస్సుల్లో తెలుగు భాష ఆవశ్యకత, అంతరించి పోతున్న భాషలపై చైతన్యం రగిలించారు. 'తెలుగు భాషతో సంబంధాలు ఉన్న బంజారాల లిపి గుర్తించాలన్నదే లక్ష్య'మంటున్నారు నరేష్ కుమార్‌నాయక్



నరేష్‌కుమార్ కనుగొన్న శిలాశాసనం

మా పదం పల్లె పదం


ఎస్కేయూలోని తెలుగు విభాగానికి చెందిన హరికృష్ణ గ్రామీణ ప్రాంతాల్లోని పల్లె పదాలకు ఆయువు పోస్తున్నారు. పట్టణీకరణ పెరగడంతో గ్రామాల్లో సహజసిద్ధంగా పొలాల్లో, పండగల్లో, సంస్కృతి సంప్రదాయాల సమయంలో పాడుకొనే పాటలు కనుమరుగు అవుతున్నాయి. అక్షరాస్యులు కంటే నిరక్ష్యరాస్యుల్లోనే ఎక్కువగా తెలుగు సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబిస్తుంది. ఈ క్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలను పర్యటించి పల్లెల్లో పాడుకొనే తెలుగు సంప్రదాయ పాటలకు సంబంధించి ఏకంగా 200 పాటలను సేకరించి వాటికి అక్షర రూపం చేశారు. జిల్లాలోని ఉరవకొండ, రాయదుర్గం, రాప్తాడు, తాడిపత్రి, గుత్తి, హిందూపురంలో ఆయా ప్రాంతాలకు అనువైన పాటలను సేకరించారు. యూజీసీ జేఆర్ఎఫ్‌కు ఎంపిక కావడంతో ఆయా పరిశోధనలు చేయడానికి అవసరమైన నిధులు సమకూరుతున్నాయి. 'తెలుగుకు మూల స్తంభం పల్లె సీమ. పల్లెల్లో పాడుకొనే పాటలను సేకరించి వాటిని భావితరాలకు అందించడమే ధ్యేయ'మంటున్నారు హరికృష్ణ.



మాండలికమే ముత్యాలప్ప అభిమతం



ఐసీఎస్ఎస్ఆర్ ఫెలోషిప్ అన్నది సాధారణంగా సైన్సు కోర్సులకు ఇస్తారు. ఎస్కేయూలోని తెలుగు తులనాత్మక అధ్యయనశాఖలో ఆచార్య నరసింహన్ పర్యవేక్షణలో పోస్టు డాక్టరల్ ఫెలోషిప్‌కు ఎంపికైన ముత్యాలప్పకు ప్రాజెక్టు నిర్వహణకు రూ. ఏడు లక్షలు మంజూరు అయ్యాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 'అనంతపురం జిల్లా మాండలికం'పై పరిశోధనలు చేస్తున్నారు. వాస్తవానికి ఆత్మకూరు మండలం బి. యాలేరు స్వగ్రామం కావడంతో పల్లెకు సంబంధించిన అంశాలను ఎంపిక చేసుకున్నారు. జిల్లాలోని మాండలికాలు అన్నీ క్రోడీకరించడమే ధ్యేయమంటున్నారు ముత్యాలప్ప. 'జాతీయ స్థాయిలో అనంతపురం జిల్లాలోని మాండలికాలకు గుర్తింపు తీసుకొని రావాలన్నదే తన లక్ష్య'మంటున్నారు.



భాషకు ఆయువు

బత్తలపల్లి మండలం డి. చెర్లోపల్లికి చెందిన డాక్టర్ జి. శ్రీరాములు పీజీ చేసినా సొంతభాషపై పట్టు లేదు. కనీసం మాట్లాడటం కూడా రాదు. పీజీ పూర్తి అయిన అనంతరం పీహెచ్‌డీ చేయాలనే ఆలోచన ఆయనకు ఉండేది. తెలుగు విభాగానికి చెందిన ఆచార్య హెచ్. ఎస్. బ్రహ్మానంద నీకు సంబంధించిన భాషను బతికించు అందులోనే పీహెచ్‌డీ చేయాలని సూచించారు. అనంతపురం ప్రాంతంలో ఉన్న వారికి చాలా మందికి ఎరుకుల భాష రాదు. శిష్ట సాహిత్యంలో ఏకలవ్యుని పాత్ర ఆధారంగా నాటి గిరిజన సంస్కృతి గురించి చెప్పారు. అందులోనే పరిశోధన చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు. గిరిజన సంస్కృతికి సంబంధించిన అంశాలపై మూడు పుస్తకాలు, 10 జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు, నాలుగు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన వ్యాసాలు రచించారు. యూజీసికి దరఖాస్తు చేసుకోగా పీడీఎఫ్ సైతం ఇచ్చింది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో కన్పించే ఎరుకల సంస్కృతిపై పరిశోధనలు చేసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలతో మిళితం అయినట్లు మాట్లాడే తీరుని బట్టి గుర్తించారు. 'భాష మాట్లాడే వారు లేకుంటే ఆ భాష కచ్చితంగా అంపశయ్య మీద ఉన్నట్లేనని, భాషను మాట్లాడితేనే పదికాలాల పాటు సజీవంగా ఉంటుందని' శ్రీరాములు పేర్కొంటున్నారు.



పరిశోధనా రచనను చూపుతున్న శ్రీరాములు

తెలుగుతోనే జగమంతా వెలుగు

సంతకాలు తెలుగులో చేస్తామని ప్రతిజ్ఞ

'ఈనాడు' ఆధ్వర్యంలో చర్చావేదిక

'తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ..
యెల్ల నృపులు గొలువ యెఱుగవేబాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స'

- శ్రీకృష్ణదేవరాయలు



న్యూస్‌టుడే-ఎస్.కె.విశ్వవిద్యాలయం

తెలుగు భాషను అమితంగా ప్రేమించే శ్రీకృష్ణదేవరాయలు నడియాడిన ఈ ప్రాంతంలో తెలుగు భాష అభివృద్ధికి యువత మరింత కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం తెలుగు దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఈనాడు' ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు సాహిత్యశాఖలో 'తెలుగు వెలుగాలంటే యువత ఏం చేయాలి' అనే అంశంపై సోమవారం చర్చావేదిక జరిగింది. చర్చవేదికకు తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ సదాశివారెడ్డి సంధానకర్తగా వ్యవహరించారు. అమరావతి పేరుతో వెలసిన తెలుగు నేలలో తెలుగుభాషకు జగమంతా వెలుగు తీసుకురావాల్సి ఉందన్నారు. యువత కేవలం మాటలకే పరిమితం కాకుండా ఎవరి స్థాయిల్లో వారు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వాలు, అధికారులు ఏం చేస్తే తెలుగు జగాన వెలుగుతుందో పలు నిర్ణయాలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న సదాశివారెడ్డి



తెలుగులోనే సంతకాలు చేస్తామంటూ విద్యార్థుల ప్రతిజ్ఞ

ఇలా సాగితే 'తెలుగు వెలుగు'

- ❐ ఉత్తర ప్రత్యుత్తరాలు, సంతకాలన్నీ ఇకపై తెలుగులోనే చేపట్టాలని మార్పు మా నుంచే వస్తుందంటూ ప్రతిజ్ఞ
- ❐ ప్రాథమిక స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి వరకు కచ్చితంగా మాతృభాష తప్పని సరి చేయాలి
- ❐ అధికార భాషా సంఘం కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి
- ❐ మాతృభాష కోసం కేటాయించిన మంత్రి పదవికి మరింత ప్రాధాన్యం ఇచ్చి కేవలం ఒక శాఖను మాత్రమే అప్పగించాలి
- ❐ తెలుగు భాషాభివృద్ధికి సంబంధించి ముగ్గురు సభ్యులతో నియమించిన కమిటీ తన నివేదికను వెల్లడించాలి
- ❐ ప్రతి పోటీ పరీక్షల్లో తెలుగుభాషకు సంబంధించి ప్రత్యేకంగా మార్కులు నిర్ణయించాలి
- ❐ పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలో పదో తరగతి వరకు మాతృభాషలోనే బోధించాలని చట్టం ఉండటంతో ఆ తరహా చట్టం తీసుకురావాలి.

మాతృభాషను విస్మరిస్తే ఇబ్బందే..



కనుమరుగవుతున్న భాషల్లో తెలుగు ఉందంటున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలు ఎంతో ఘనంగా నిర్వహించినా అందులో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదు. వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిందే. జాతిపిత అన్నట్లు ఆయా ప్రాంతాలు మాతృభాషను విస్మరిస్తే ఇబ్బందే. భాష కనుమరుగైతే బతికినా చచ్చినట్లే.

- శ్రావణి, పీజీ ప్రథమ సంవత్సరం

యువతతోనే సాధ్యం



తెలుగు అంటే అభిమానం. అందుకే తెలుగు విభాగంలో చేరా. యువత తెలుగుకు ప్రాధాన్యమివ్వాలి. ప్రభుత్వాలు తెలుగు భాష అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించాలి. తమిళనాడు, కర్ణాటకలో ఆప్రాంత భాష వస్తేనే ఉద్యోగాలు ఇస్తుండగా ఇక్కడ ఎందుకు అమలు చేయరు?.

- సంగాలు, తెలుగు పీజీ ప్రథమ సంవత్సరం

ప్రభుత్వాలదే బాధ్యత



తెలుగు భాషను బతికించడంలో ప్రభుత్వాలదే బాధ్యత. తెలుగు పాఠశాలలను తొలగించి ఆంగ్లపాఠశాలలను పెట్టాలనుకొనే నిర్ణయం ఉపసంహరించుకోవాలి. యూజీసీ స్థాయిలో తెలుగుకు ప్రాధాన్యం ఇస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఆ స్థాయిలో అవకాశాలు కల్పించడం లేదు.

- నాగేంద్ర, పీడీఎఫ్

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



ఏ దేశంలో అయితే మాతృభాషను విస్మరిస్తే ఆ ప్రాంతంలో సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు అయినట్లే. భాష లేకుంటే శ్వాస ఆగినట్లే. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆంగ్లభాష రావాలని ఆంగ్లపాఠశాలల్లోనే చేర్పించే విధానంలో మార్పు రావాలి. తెలుగుకు అవకాశాలు పెంచితే భాషపై అభిమానం పెరుగుతుంది.

- కృష్ణవేణి, తెలుగు పీజీ ద్వితీయ సంవత్సరం

తెలంగాణ మాండలికాలపై శోధన

కదిరి పట్టణం: తెలుగుసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సాహిత్య విమర్శకులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రాంతం నుంచి తెలుగు కథలను సుసంపన్నం చేసిన రచయితల్లో అగ్రగణ్యుడైన మల్లయ్య కథలపై కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు ఆదినారాయణ పరిశోధనలు ప్రారంభించారు. దాదాపు 500 కథలపై పరిశోధనలు చేశారు. భాషను అందలమెక్కిస్తూ సామాన్యుడి స్థితిగతులను పాఠకుడికి చేరవేయడంలో మాండలికాల పాత్ర ఎంతో కీలకమని మల్లయ్య రచనల ద్వారా తెలుసుకోవచ్చని ఆదినారాయణ చెబుతారు. తెలంగాణ ప్రాంతంలోని విప్లవోద్యమాన్ని తనదైన దృక్పథంతో ప్రతిబింబిస్తూనే, దళిత, స్త్రీవాద, బహుజన ఆలోచనా విధానాన్ని తెలంగాణ ప్రాంతీయ జీవితాన్ని కథల ద్వారా ప్రతిబింబింపచేశారంటారు. ఆయన రచనల్లో మూడు అంశాలు ప్రధానంగా స్పష్టమవుతాయని, జీవనస్థితి, చరిత్ర, భాష, ఒకదానికొకటి పరస్పరం సంబంధం కలిగినవే అంటారు ఆదినారాయణ.

పరిశోధన



సదస్సులో మాట్లాడుతున్న ఆదినారాయణ (పాతచిత్రం)

మూడేళ్లుగా తెలుగు సాహిత్యం కోసం కృషి

నేడు గిడుగు రామ్మూర్తి పంతుల పురస్కారం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గానికి చెందిన కవి కెరె. జగదీష్ తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ప్రతి రోజూ ఒక తెలుగు కవిత్వాన్ని రాసి ఫేస్‌బుక్‌లో ప్రజలకు అందిస్తున్నారు. 2015 నుంచి వెయ్యికి పైగా చిరు కవిత్వాలను ఆయన రాశారు. ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో జరిగిన కవి సమ్మేళనాల్లో పాల్గొని తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూ పలు పురస్కారాలు అందుకున్నారు. తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషికి ఈ ఏడాది తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో మంగళవారం గిడుగు రామ్మూర్తి పంతుల సాహితీపురస్కారం రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఆయన రాసిన చిరుకవితల్లో అమ్మతనం, కాలచక్రం, లక్ష్యం, పేగుబంధం పేరుగాంచాయి. 2011లో సముద్రమంత గాయం, 2012లో రాత్రిసూర్యుడు దీర్ఘకావ్యాలను రచించి పలు పురస్కారాలు పొందారు. అంధుల జీవితంపై కెరె. జగదీష్ రాసిన రాత్రిసూర్యుడు దీర్ఘకావ్యాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పీజీ విద్యార్థులకు పాఠ్యాంశంగా తీసుకున్నారు. ఇది హిందీ, మరాఠీ భాషలో అనువాదమయ్యింది. ఆంగ్ల అనువాదం ప్రచురించాల్సి ఉంది. ఒరియా, కన్నడ భాషల్లో అనువాదం కావాల్సి ఉంది.

సాహితీ సేవ



లక్ష్యం కవితపోస్టర్



కెరె.జగదీష్

మాతృభాషతో మానసిక వికాసం

తలవాలకట్టవీధి (పామిడి), న్యూస్‌టుడే: 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్నారు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయులు. తెలుగును "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అన్నారు పాశ్చాత్యులు. అంతటి ఘన చరిత్ర గలది తెలుగు భాష. స్థానిక తలవాలకట్టవీధిలోని ఐదో వార్డు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ మాతృభాష పట్ల పిల్లలకు ఇష్టం కలిగే విధంగా మంచి ప్రేరణ కోసం అనేక కృత్యాలను నిర్వహిస్తూ వారికి మాతృభాషపై మమకారాన్ని పెంపొందిస్తున్నారు. పంచతంత్ర కథలు, తెలుగులో చక్కటి అభినయ గేయాలు, వీడియోల ద్వారా ప్రదర్శించడం వల్ల వారు త్వరగా నేర్చుకోగలుగుతున్నారు. తెలుగుభాష ఉచ్చారణ కోసం పదజాలాభివృద్ధికి, భావవ్యక్తీకరణకు, దేశభక్తి గేయాలు, చిన్న చిన్న కవితలు, ఇంకా అనేక భాషా క్రీడలను పదకేళీలను విద్యార్థులకు నేర్పిస్తున్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే అర్థమయ్యే రీతిలో బోధించాలి

ప్రాథమిక స్థాయి నుంచే చిన్నారులకు మాతృభాష పట్ల గౌరవం పెరిగే విధంగా సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించాలి. దేశభాషలందు తెలుగు లెస్స అన్న నానుడిని నిజం చేయాలి. నావంతు మాతృభాషపై ఉన్న మమకారంతో విద్యార్థులకు చక్కగా తెలుగు పాఠ్యాంశాలను బోధిస్తూ, వారికి తెలుగుపట్ల అభిమానం కలిగే విధంగా వ్యవహరిస్తున్నందున నా వృత్తికి న్యాయం చేస్తున్నట్లు గర్వపడుతున్నా.

- సురేష్, ఉపాధ్యాయుడు, పామిడి

చైతన్యం



విద్యార్థులతో ఉపాధ్యాయుడు సురేష్

అమ్మ భాషకు అక్షర రూపం

అనంతపురంలోని గుత్తిరోడ్డులో ఉన్న మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు 'తెలుగు వెలుగు' అంటూ అక్షర రూపం ఇచ్చారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా.. అమ్మభాషను మరువవద్దని సూచించారు. చిన్నారుల్లో మాతృభాష ఆవశ్యకతను తెలియజెప్పే ప్రయత్నం చేశారు.

- న్యూస్‌టుడే, అనంతపురం విద్య



చిన్నారులకు 'బాలామృతం'



అనంత ప్రాజెక్టులో నిల్వ చేసిన పౌష్టికాహార మిశ్రమం

- 1.41 లక్షల పిల్లలకు లబ్ధి
- సెప్టెంబరు ఒకటిన పునఃప్రారంభం
- ఐసీడీఎస్‌లకు చేరిన పౌష్టికాహారం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: బాలామృతం.. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నియంత్రించే బృహత్తర పథకమిది. దీన్ని పునః ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభిం చనుంది. ఈక్రమంలో పౌష్టికాహార మిశ్రమం జిల్లాకు చేరుతోంది. సోమవారం వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సరఫరా అయింది. రెండు రోజుల్లో మిలిగిన ప్రాజెక్టులకు సరఫరా కానున్నట్లు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి పీడీ కృష్ణకుమారి తెలిపారు. ఏడు మాసాల నుంచి మూడేళ్ల వయసు కల్గిన పిల్లలకు మాత్రమే బాలామృతం అమలు చేస్తారు. 2015 డిసెంబరు దాకా బాలామృతం అమల్లో ఉండేది. అప్పట్లో ఆరోపణలు రావడంతో ముగింపు పలికారు. దీని స్థానంలో 2016 జనవరి నుంచి పిల్లలకు నెలకు 2.7 కిలోల బియ్యం, అర కిలో కంది బేడలు, అర కిలో నూనె, ఎనిమిది కోడిగుడ్లు చొప్పున పంపిణీ చేస్తున్నారు. తాజాగా సెప్టెంబరు ఒకటి నుంచి బాలామృతం రానుంది. ఇక ఇంటికి సరకులు ఇచ్చే ప్రక్రియ ఉండదు. నేరుగా పౌష్టికాహారం అందజేస్తారు. పౌష్టికాహారం గోదాముల్లో నిల్వ చేసుకోవాలని ఇన్‌ఛార్జి పీడీ కృష్ణకుమారి తెలిపారు. దీనిపై ఇప్పటికే చరవాణి ద్వారా సీడీపీఓలతో మాట్లాడారు. ఈ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ సైతం బాలామృతంపై సమీక్ష జరిపారు.

ఒక్కొక్కరికి 2.5 కిలోలు

జిల్లాలోని 5,126 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు మాసాల నుంచి 3 ఏళ్ల వయసు లోపు పిల్లలు మొత్తం 1.40,758 మంది ఉన్నారు. వీరిలో ఏడు నెలల నుంచి ఏడాదిలోపు పిల్లలు 34,114 మంది, 1-3 ఏళ్లలోపు చిన్నారులు 1,06,644 మంది ఉన్నారు. మొత్తం 1,40,758 మందిలో బాలికలు 67,936, బాలురు 72,822 మంది ఉన్నట్లు లెక్కలు తేల్చారు.

ఒక్కొక్కరికి నెలకు 2.5 కిలోల ప్రకారం పౌష్టికాహార మిశ్రమాన్ని అందిస్తారు. ప్రతి నెలా ఒకటో తేదీనే సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని తల్లులకు అందజేస్తారు. ఈ పిండి వల్ల ఖనిజ లవణాలు కల్గిన బలవర్ధక ఆహారం పిల్లలకు అందనుంది.

బలవర్ధకం

పౌష్టికాహార మిశ్రమంలో గోధుమ పిండి, సెనగపప్పు, పంచదార, నూనె, పాలపొడి ఉంటుంది. ఈ ఐదు మిశ్రమాలతో తయారు చేశారు. ఇందులో క్యాల్షియం, ఇనుము, విటమిన్ ఏ, బి, డీ2, సీ, ఫోలిక్ యాసిడ్ వంటివి పుష్కలంగా ఉంటాయి.

ఎలా తినిపించాలి?

పౌష్టికాహార మిశ్రమ(పొడి) ప్యాకెట్ తెరిచిన 30 రోజుల్లోపే పూర్తి చేయాలి. దోమలు, బొద్దింకలకు దూరంగా ఉంచాలి. రోజుకు మూడు పూటలా పిల్లలకు పెట్టాలి. గోరు వెచ్చని నీరు లేదా పాలల్లో కలిపి తాపించాలి. ఒక్కోసారి 30 నుంచి 35 గ్రాముల చొప్పున తీసుకుంటే చాలు. ఇలా నెలకు 2.5 కిలోలను పూర్తి చేయాలి.



ఎంపిక పోటీలు నిర్వహిస్తూ..

యువతలో జాతీయభావం పెంపు

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: యువతలో జాతీయతా భావం, దేశభక్తి, సేవా కార్యక్రమాలు పెంపొందించే దిశగా జాతీయ సేవా పథకం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. ఎస్కేయూ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులను ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక చేయడానికి పలు ప్రక్రియలు నిర్వహించారు. క్రీడా మైదానంలో పరుగు పందెం, ఎత్తు, పరేడ్‌తో పాటు వ్యక్తిగత మౌఖిక పరీక్షలు జరిపారు. ఇందులో చక్కటి ప్రతిభ చాటిన విద్యార్థులను మాత్రమే పరేడ్‌కు ఎంపిక చేస్తారు. 10రోజుల పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చి, అనంతరం రిపబ్లిక్ పరేడ్‌కు పంపుతారు. కార్యక్రమంలో ఎస్కేయూ జాతీయ సేవాపథకం సమన్వయకర్త ఆచార్య కృష్ణకుమారి, పలువురు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

సెలవులో నుంచి నేడు విధుల్లోకి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్‌కు పదోన్నతి లభించింది. ఆయన 2007 గ్రూప్-1 పోటీ పరీక్షల్లో గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయనకు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం పని చేస్తున్న చోటే కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో సెలవులో ఉన్న ఆయన మంగళవారం విధుల్లో చేరనున్నట్లు తెలిసింది. పదోన్నతి కల్పించిన తరువాత తప్పనిసరిగా విధుల్లో చేరాల్సి ఉండటంతో ఆయన ఇక్కడికి వస్తున్నారు. ఛైర్‌పర్సన్ లక్ష్మీ భర్త నాగరాజుకు, కమిషనర్‌కు మధ్య ఉన్న విబేధాల కారణంగా ఆయనను బదిలీ చేయించడానికి నాగరాజు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. దీంతో తన బదిలీ తప్పదని తెలుసుకొన్న మున్సిపల్ కమిషనర్ ఫారిన్ సర్వీస్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఇ.వో.గా వెళ్లడానికి ఈ నెలఖారు వరకు సెలవు పెట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పదోన్నతి నేపథ్యంలో ఆయన బదిలీ ఆలస్యం కానున్నట్లు సమాచారం.

ప్రీరిపబ్లిక్ పరేడ్‌కు విద్యార్థిని ఎంపిక

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: అనంతపురం ఆర్ట్స్ కళాశాలకు చెందిన విద్యార్థిని మనీషా ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక అయినట్లు ప్రధానాచార్యులు రంగస్వామి తెలిపారు. కళాశాలలో జాతీయ సేవాపథకం కార్యక్రమాల్లో విద్యార్థిని చురుగ్గా పాల్గొంటున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో కళాశాల కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింప చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఉపప్రధానాచార్యులు పద్మశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శ్రీరాములు, సలీం, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పరభాష కాదు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉర్దూ పరభాష కాదని ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు రంగస్వామి తెలిపారు. సోమవారం ఆర్ట్స్ కళాశాలలోని ఉర్దూ విభాగం ఆధ్వర్యంలో 'ఉర్దూ సాహిత్యం- ప్రాముఖ్యత' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భాష నేర్చుకుంటే బహుళ ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పరిశోధనా అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ బాలగంగాధర్, విభాగపు అధిపతి సయ్యద్ యాసిన్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూపు-1 పరీక్ష

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి నిర్వహించిన గ్రూపు-1 ప్రధాన రాత పరీక్ష సోమవారం ముగిసింది. ఈ పరీక్షలకు మొత్తం 688 మంది అభ్యర్థులకు గాను 407 మంది హాజరైనట్లు పరీక్షల కోఆర్డినేటర్, డీఆర్వో మల్లీశ్వరీదేవి తెలిపారు. జవాబు పత్రాలన్నీ ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించారు.

ముగ్గురు ఉప తహసీల్దార్లకు పదోన్నతి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో ముగ్గురు ఉప తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. సోమవారం రాజధానిలో డీపీసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పదోన్నతులపై చర్చించారు. ఎంతమంది సీనియర్లు ఉన్నారో ఆరా తీశారు. రెవెన్యూశాఖలో రాష్ట్రంలో మొత్తం 72 మంది ఉపతహసీల్దార్లకు పదోన్నతులు కల్పించనున్నారు. వారిలో రాయలసీమ జోన్ 64లో 18 మందికి గాను జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లుగా పదోన్నతులు పొందనున్నట్లు ఆశాఖ వర్గాలు తెలిపాయి.

భవనాల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: భవనాలను పరిశీలించి అనుమతులు లేని వాటి పనులు నిలిపి వేయించినట్లు పట్టణ ప్రణాళికాధికారి కృష్ణారావు తెలిపారు. సోమవారం 'ఈనాడు'లో అక్రమం ప్రణాళిక ప్రకారం అనే కథనానికి ఆ శాఖాధికారులు స్పందించారు. అనుమతి లేని భవన నిర్మాణ పనులు పరిశీలించారు. అనుమతి లేని భవనాల పనులు నిలిపివేశారు. త్వరితగతిన అనుమతులు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని భవననిర్మాణదారులకు ఆదేశించారు.

చేనేతకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: చేనేతలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర చేనేత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలా రామాంజయలు డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు అచ్చేదిన్- రైతులకు చచ్చేదిన్ అనే కార్యక్రమంపై నిర్వహించిన జీపుజాతా సోమవారం బత్తలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా చేనేతలు రాష్ట్రంలో ఉన్నారని చేనేతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, జేవీ రామయ్య, ఆదినారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించాల్సిందే

మీకోసంలో జేసీ రమామణి ఆదేశం



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ రమామణి, శిక్షణ కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి కార్యాలయం, పరిష్కారవేదిక, జన్మభూమి, మీకోసం, ఎస్సీ, ఎస్టీ, ఆన్‌లైన్, సాధారణగా వచ్చే అర్జీలన్నింటికీ వందశాతం పరిష్కారం చూపాల్సిందేనని సంయుక్త కలెక్టర్ రమామణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమంలో భాగంగా అర్జీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే మీకోసం అర్జీలపై అధికారులు దృష్టి పెడుతున్నారు. వాటికి పరిష్కారం చేస్తున్నారు. మిగిలిన అర్జీలు పెండింగ్‌లో ఉంటున్నాయి. వాటి సంగతేంటని జేసీ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్ అర్జీలు 93 శాతం, ఆన్‌లైన్ అర్జీలు 94 శాతం, ముఖ్యమంత్రి కార్యాలయ అర్జీలు 93 శాతం, పరిష్కార వేదిక అర్జీలు 42 శాతం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారమార్గం చూపాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జేసీతో పాటు శిక్షణ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో మల్లీశ్వరీదేవి తదితరులు వినతులు తీసుకున్నారు.

★ పరిగి మండలం అక్కంపల్లి నుంచి ఊటుకూరుకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరం ఉంది. మట్టి, గుంతల పడిన రహదారిపై వెళ్లలేక అవస్థలు పడుతున్నాం. పలు దఫాలుగా అధికారులకు విన్నవించాం. జన్మభూమిలో పలు అర్జీలు కూడా ఇచ్చాం. పాలకులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డును విస్తరించి, మరమ్మతు చేయించాలని అక్కంపల్లి గ్రామ ప్రజలు జేసీని వేడుకున్నారు.

★ ధర్మవరం, యాడికి, ఉరవకొండ, హిందూపురం మండలాల్లో వందలాది మంది చేనేతలకు పాసుపుస్తకాలు మంజూరు చేయలేదు. దీంతో ప్రభుత్వం అందించే రాయితీలు కోల్పోతున్నాం. పాసుపుస్తకాలు అందించి ఆదుకోవాలని ఆయా ప్రాంతాల చేనేత కార్మికులు అధికారులను కోరారు.

★ సర్వే నంబరు 267-3లో 5.20 ఎకరాలు, సర్వే నంబరు 108లో 2 ఎకరాల భూమి ఉంది. గత కొన్ని నెలలుగా పట్టాదారు పాసుపుస్తకం కోసం తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదు. దీంతో ప్రతివారం మీకోసంలో అర్జీలు ఇచ్చుకున్నా ఫలితం లేకుండా పోయిందని మడకశిర మండలం గొల్లపల్లికి చెందిన గోవిందప్ప వాపోయాడు.

సంజీవని.. సంగతేమని?!

♦ గణనీయంగా తగ్గిన ఔషధ అమ్మకాలు ♦ ప్రచార లోపంతో దుకాణాలు వెలవెల ♦ ఏపీఎం, సమాఖ్యల నిర్లక్ష్యంతో కుదేలు



జనరిక్ మందులు

న్యూస్‌టుడే, అనంతపురం (శ్రీనివాస్‌నగర్)

"అన్న సంజీవని'... ఇవి పేద, మధ్య తరగతి ప్రజల ఔషధ దుకాణాలుగా ప్రాచుర్యం పొందాయి. ఇటీవల ధనికులు సైతం ఈ దుకాణాల వైపే మొగ్గు చూపిస్తున్నారు. కానీ.. ఈ దుకాణాలు ఎక్కడున్నాయనే దానిపై కనీస ప్రచారం లేదు. తగనన్ని నిల్వలు, మందుల రకాలను ఉంచడం లేదనేది వాస్తవం. ఈ బాగోతంలో ఏదో తెలియని మతలబు దాగి ఉన్నట్లు నీలినీడలు కమ్ముకున్నాయి. ఉదాహరణకు.. పది మాత్రలతో కూడిన ఒక యాంటిబయాటిక్ స్ట్రిప్ ప్రైవేట్‌గా (బ్రాండెడ్) అయితే రూ.189 ఉంటుంది. ఇదే మాత్రల స్ట్రిప్ అన్న సంజీవనిలో (జనరిక్) కేవలం రూ.19 మాత్రమే. ప్రైవేట్... జనరిక్ ఔషధాల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో ఈ ఒక్క ఉదాహరణ చాలు. మందు పనిచేసే సామర్థ్యంలో ఏమాత్రం తేడా ఉండదు. రెండూ ఒక్కటే పని చేస్తాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన అన్న సంజీవని దుకాణాల నిర్వహణపై పూర్తి స్థాయిలో ప్రచారం కొరవడింది. సమీక్షల్లో చెప్పుకోవడం తప్ప... ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఏపీఎం, మండల సమాఖ్యల ప్రతినిధులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఈ దుకాణాల నిర్వహణ తమకు సంబంధం లేదన్న రీతిలో వ్యవహరించడమే ఇందుకు మూలం."

అన్న సంజీవని దుకాణాలు	16
వెలుగు	14
మెప్మా	02
ఆర్డర్లు	1,83,610
అమ్మకాల విలువ	రూ. 2.2 కోట్లు

16లో మూడు మూత...

జిల్లాలో మొత్తం 16 అన్న సంజీవని దుకాణాలు ఉన్నాయి. ఇందులో వెలుగు సారథ్యంలో 14, మెప్మా సారథ్యంలో రెండు దుకాణాలు ఉన్నాయి. ఈ 16లోనూ... నార్పల, పామిడి, బత్తలపల్లిలో మూసేశారు. మిగిలిన వాటిలో అనంతలో రెండు, హిందూపురంలో రెండు, గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, గోరంట్ల, కొత్తచెరువు, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో ఈ అన్న సంజీవని దుకాణాలు నడుస్తున్నాయి. వీటిలో అనంత, హిందూపురం, ధర్మవరం పట్టణాల్లోని దుకాణాల్లో అమ్మకాలు ఆశించిన మేర ఉన్నాయి. రోజూ కనీసం రూ.2 వేలు అమ్మకాలు జరిగితే తప్ప.. ఈ దుకాణాల నిర్వహణ కష్ట సాధ్యమే. ఈ దిశగా చాలా దుకాణాలు సాగలేదు. జనవరిలో బత్తలపల్లి, మార్చిలో పామిడి, ఏప్రిల్ నుంచి నార్పల దుకాణాలు తెరవలేదు. ఇక్కడ అమ్మకాలు సాగకపోవడమే కారణం.

పరిశీలన

మందగించిన అమ్మకాలు...

అన్న సంజీవని దుకాణాల నిర్వహణను బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తగిన చొరవ చూపిస్తోంది. కానీ క్షేత్ర స్థాయిలో అశ్రద్ధ ఎక్కువైంది. ఈ దుకాణాలను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి దాకా మొత్తం 1,83,610 మంది కొన్నారు. ఈమేరకు రూ.2.2 కోట్ల అమ్మకాలు జరిగాయి. అనంతలో (వెలుగు) రూ.71.29 లక్షలు, అనంతలో (మెప్మా) రూ.17.55 లక్షలు, ధర్మవరం రూ.41.07 లక్షలు, హిందూపురంలో రూ.20.24 లక్షలు చొప్పున అమ్మకాలు జరిగాయి. ఇక అధ్వాన దుస్థితిలో ఉన్న దుకాణాలల్లో.. బత్తలపల్లి రూ.1.6 లక్షలు, నార్పలలో రూ.1.78 లక్షలు, పామిడిలో రూ.2.46 లక్షలు చొప్పున అమ్మకాలు జరిపాయి. ఇపుడు ఈ మూడింటిని మూసేశారు. ఇక... గత మంగళవారం రోజు అమ్మకాలను చూస్తే మొత్తం 259 మంది రూ.29,579 కొన్నారంతే. అనంతలో రూ.10 వేలు, గుంతకల్లులో రూ.3 వేలు, హిందూపురంలో రూ.5 వేలు, అనంత (మెప్మా), గోరంట్లలో రూ.2 వేలకు పైగా విక్రయాలు సాగాయి. మెప్మా హిందూపురం, రాయదుర్గం అసలు విక్రయాలే సాగలేదు. పెనుకొండలో రూ.254, కొత్తచెరువులో రూ.427 మాత్రమే వచ్చింది. వీటిని బట్టి జనరిక్ మందుల అమ్మకాలు ఏ స్థాయిలో మందగించాయో అవగతం అవుతోంది. మరో వైపు.. రెండు మూడు పట్టణాల్లో మినహా... అత్యధిక దుకాణాల్లో తగినన్ని నిల్వలు, మందుల రకాలు ఉండటం లేదు. మొత్తం 902 రకాల మందులు అందుబాటులో ఉండాలి. కొన్ని చోట్లా రెండు మూడు వందలు కూడా ఉండటం లేదు.

మూణ్నాళ్ల ముచ్చట



మూతపడిన దుకాణం

పామిడి, న్యూస్‌టుడే: స్థానిక జ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది పర్యవేక్షణలో జనరిక్ మందుల దుకాణం నిర్వహించేలా స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కింద దుకాణాల సముదాయాల్లో ఓ అద్దె గదిలో ప్రారంభించారు. సదరు మందుల దుకాణం ప్రజలకు కన్పించకుండా లోపల ఏర్పాటుచేయడంతో ఆదరణ కరవై గత ఆరు నెలలుగా మూతపడింది. ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసి ఉంటే మందుల దుకాణానికి చక్కటి స్పందన ఉండేది. మందుల కొనుగోలుకు వచ్చే పేదలు దుకాణం వద్దకు వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళ్తూ గత్యంతరం లేక అధిక ధరలకు మందులను కొనుగోలు చేస్తున్నారు.

బయట కొనాల్సిందే..

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం ప్రజలకు నాణ్యమైన ఔషధ మందులను అందించాలని అన్న సంజీవని పేరుతో డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి సరసమైన ధరలకు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసినా... నేడు రోగులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. 600 రకాలకు పైగా ఇక్కడ మందులు ఉంచాల్సి ఉన్నా.. కేవలం 200 మందులు రకాలు మాత్రమే ఉంటున్నాయి. దీంతో రోగులు అందుబాటులో లేని మందులు బయట కొనాల్సి వస్తోంది. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా డీఆర్‌డీఏ అధికారులు చక్కదిద్దే ప్రయత్నాలు చేయలేదు.

పేరుకు 606.. చెంతన 150



అరకొర మందులతో నడుస్తున్న అన్నసంజీవిని దుకాణం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో జనరిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు అందుబాటులో ఉంటేనే దీనిని తెరుస్తున్నారు. లేదంటే మూసివేత తథ్యం. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఈ కేంద్రం నడుస్తుంది. ప్రజలు రద్దీగా ఉండేచోట ఏర్పాటు చేయమని రెండేళ్లుగా కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. గతంలో రోజుకు రూ.2 వేలకు పైగా వ్యాపారం జరగ్గా.. ప్రస్తుతం రూ.1,500 వ్యాపారం జరుగుతోంది. వెలుగు అధికారులు, సిబ్బంది మండల సమాఖ్యలు, ప్రభుత్వ వైద్యులు ఎవరూ అన్న సంజీవని దుకాణాలకు వెళ్లమని చెప్పటం లేదు. 606 మందులను దుకాణానికి సరఫరా చేయాల్సి ఉన్నా కేవలం 150 రకాల మందులు మాత్రమే ఉన్నాయి. గత నెల రోజులుగా మండల సమాఖ్య నిధులు మంజూరు చేయకపోవటంతో మందుల కొరత ఉండేది. ఇటీవలే రూ.35 వేల విలువైన మందులను కొనుగోలు చేశారు.



వైద్యులు లేకుంటే మూతే...

బలోపేతంపై ప్రత్యేక శ్రద్ధ

అన్న సంజీవని దుకాణాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ఇటీవలే ఫార్మసిస్టు, మండల సమాఖ్య ప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష జరిపాం. ఇక నుంచి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల దాకా దుకాణాలు నిర్వహిస్తారు. ప్రస్తుత ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగని నార్పల, బత్తలపల్లి, పామిడి వంటి కేంద్రాలను ఇపుడు ఆ ప్రాంతం నుంచి జన సంచార ప్రాంతాలకు మార్పు చేస్తున్నాం. మందులు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఏ ప్రాంతంలో ఏవి ఎక్కువ అమ్మకం సాగుతాయో.. వాటినే సరఫరా చేస్తున్నాం. ఇందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కేంద్ర గోదామును కూడా ప్రారంభించాం. కాలం తీరే (ఎక్స్‌పైరీ) మందులను ఆరు నెలలు ముందుగానే వెనక్కి తెప్పించి... వీటిని వేరే చోట్లకు పంపిస్తున్నాం. కొత్తగా మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాం. **- వెంకటేశ్వర్లు, పీడీ, డీఆర్‌డీఏ-వెలుగు**

ఈ-పంట నమోదు తప్పనిసరి



వీసీలో మాట్లాడుతున్న జేసీ రమామణి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి ఎకరాను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయాలి. ఇందులో తప్పులు దొర్లితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంయుక్త కలెక్టర్ రమామణి హెచ్చరించారు. ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, ఈ-పంట నమోదు, వ్యక్తిగత మరుగుదొడ్ల తదితర అంశాలపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ నుంచి రెండో జేసీ సయ్యద్‌ఖాజాతో కలిసి జేసీ అన్ని మండలాల అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ప్రత్యామ్నాయ పంట విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. రైతులంతా పంటలు సాగు చేసుకునేలా చూడాలని సూచించారు. అలాగే జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు 1.55 లక్షలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 27,011 నిర్మించినట్లు చెప్పారు. ఇందులో రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 55,114 ఇళ్లు మంజూరు కాగా, అందులో 29,699 ఇళ్లకే పరిపాలనా అనుమతులు మంజూరు చేశారన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మొక్కల పెంపకం విరివిగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జేడీఏ శ్రీరామ్మూర్తి, డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు, ఎస్ఈ హరేరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

30న ఉద్యోగమేళా

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఈనెల 30వ తేదీ ఉదయం అనంత నగర శివారులోని టీటీడీసీ ఆవరణలో ఉద్యోగమేళా జరుగుతుందని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. బెంగళూరుకు చెందిన నాలుగు కంపెనీలు ఇందులో పాల్గొంటున్నాయి. సామ్‌సంగ్, ఎల్‌జీలో పనిచేసేందుకు 18-30 ఏళ్ల వయసు కల్గిన యువకులు అర్హులు. నెలకు 12వేలు వేతనం, పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉండాలి. టోకాయి ఆటో స్పేర్స్ కంపెనీలో పనిచేసేందుకు 18-25 ఏళ్ల వయసు కల్గిన యువకులు, నెలకు రూ.9500 వేతనం. డిప్లొమాలో మెకానికల్ ఉండాలి. అదాని గ్రీన్ ఎనర్జీలో చేరడానికి 18-30 ఏళ్ల వయసు, ఐటీఐ, డిప్లొమాలో ఎలక్ట్రికల్ విద్యార్హత తప్పనిసరి. నెలకు వేతనం రూ.10 వేల నుంచి రూ20 వేలు ఉంటుంది. ఉద్యోగ మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు ఆధార్, రేషన్, విద్యార్హత పత్రాలను వెంట తీసుకురావాలని పీడీ సూచించారు.

Junior Inter

STUDY PLAN

Physics

Every student who wants to study Physics seriously, must collect and revise frequently all the basic formulae with detailed description along with related units from all the chapters (Follow the prescribed text book for this task.) Don't forget that text book reading is mandatory. Keenly go through every paragraph of each chapter/ subtopic.

ప్రతిభ

To get a glamourous score...

How to avoid Physics-O-Phobia?

Physics cannot exist without the continuous and compulsory support of Mathematics. Mathematics is the back bone of Physics. A student who wants to get a glamourous score (especially in competitive exams like IIT-JEE, NEET, AIIMS, JIPMER, EAMCET etc.,) in Physics, must have thorough working knowledge of school level Mathematics. The algebra, the trigonometry, the geometry and elementary ideas from calculus are much needed. Have good grip over the mathematical formulae from the above said topics to avoid, physics-O-Phobia. Finally remember "Mathematics is the Language of Physics."

- Go through solved examples, Summary and points to ponder (given at the end of each chapter.)
- For answering objective questions in Physics successfully and rapidly in various competitive exams, every student must have sound knowledge in following areas: Angles, directions, conversion of units, ratios (percentage of changes) and hand rules (Right hand rule & left hand rule). Derivatives & integrals.
- Work seriously on various graphs related to the chapters (Chapters 3, 5, 8, 10, 12, 13 & 14 from Text book).
- Concentrate on Universal Formulae like,

  i) $F_{net} = ma$ ii) $C_p - C_v = R$ iii) $\Delta U = n.C_v.\Delta T$

  iv) $PV = nTR$ v) $\frac{C_p}{C_v} = r$ vi) $\Delta Q = \Delta U + \Delta W$
- For fast calculations while answering objective questions it is worth remembering various physical constants in a easy way.

Ex: 1) $G = 6.67 \times 10^{-11}\ Nm^2\ Kg^{-2}$

2) $R = \frac{25}{3}\ J\ mol^{-1}\ k^{-1} = 2\ Cal\ mol^{-1}\ k^{-1}$

3) Wien's Constant, $b = 2.9 \times 10^{-3}$ m.k

4) Stefan's Constant

$\sigma = 5.67 \times 10^{-8}\ Wm^{-2}\ K^{-4}$

★ Every student who wants useful result in competitive exams must concentrate more on the following chapters:

1. Motion in a straight line (Chapter 3)
2. Motion in a plane (Chapter 4)
3. Laws of motion (Chapter 5)
4. Work, Energy and power (Chapter 6)

Core chapters in Physics (1–4)

5. System of particles and Rotational motion (Chapter 7)
6. Oscillations (Chapter 8)
7. Thermodynamics (Chapter 13)

★ One must have good grip on vectors (Addition, Resolution, Scalar multiplication with a vector, Dot Product & cross product).

First year chapters linked with Second year chapters

- Oscillations (Linked with Waves, Wave optics & Electromagnetic Waves of Second Year).
- Motion in straight line, Motion in a plane, Work Energy & Power are core chapters which are connected to second year topics like motion of charged particle through electric, magnetic fields & their combined fields.
- Thermodynamics, Thermal expansion of Gases & kinetic theory are chemistry overlapped chapters (one shot two birds!!)

Some useful tips for competitive exams:

- Don't neglect the chapter like physical World, units & Measurements, Kinetic Theory.



★ From the chapter "Physical World," questions on fundamental forces of nature, contribution of Indian Scientists (Sir C.V.Raman, S.Chandra Sekhar, J.C.Bose, S.N.Saha, S.N.Bose, H.J.Bhabha) are expected.

